

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	38.2	27.4
కావలి	36	28
ఆత్మకూరు	38	28
ఉదయగిరి	39	27
కందుకూరు	36	29



మే 5న నీటి విడుదల

- 5.29 లక్షల ఎకరాలు.. 59.42 టీఎంసీలు

- రెండో పంటకు నీటి కేటాయింపుల ఖరారు
- ఐఏబీలో తీర్మానించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- లస్కర్లను తిరిగి నియమిస్తాం
- ఓఅండ్ఎం పనులకు రూ.18 కోట్ల మంజూరు
- ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించండి
- సమావేశంలో మంత్రి ఆనం వెల్లడి



ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన కలెక్టర్ ఆనంద్, ప్రజాప్రతినిధులు

నెల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 5.29 లక్షల ఎకరాల్లో రెండో పంట సాగు చేసుకునేందుకు సాగునీటిసలహా మండలి (ఐఏబీ)లో తీర్మానించారు. ఇందుకు గానూ 59.42 టీఎంసీలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకోగా, మే నెల 5వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఓ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఐఏబీ సమావేశానికి మంత్రి ఆనం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ, ఎమ్మె ల్యేలు, నీటి సంఘాల అధ్యక్షులు, రైతు నాయకులు పాల్గొన్నారు. ఎడగారులో సాగుపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించిన కేటాయింపులపై సమీక్షించి, కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సోమశిల ప్రాజెక్టులో 52.653 టీఎంసీల నీరు ఉంటుందని అంచనా వేసి డెడ్ స్టోరేజీ 7.50 టీఎంసీలు, నీటి ఆవిరి నష్టాలు 1.50 టీఎంసీలు, తాగునీటికి 3.50 టీఎంసీలను మినహాయించారు. ఈ మిగులు నీటికి సర్వేపల్లి, కనిగిరి రిజర్వాయర్లలో ఉన్న నీటిని కలుపుకుంటే నికరంగా 43.768 టీఎంసీలు మిగులుతుందని అంచనా వేశారు. ఈ నీటి ద్వారా ఒక టీఎంసీతో 8500 ఎకరాలను పండించే విధంగా ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. మొత్తంగా సోమశిల కింద 3.69 లక్షల ఎకరాలకు కేటాయింపులను ప్రతిపాదించగా, వీటికి కొన్ని సవరణలు చేశారు. నీరు ఉందని వృథా చేయకుండా ఒక్కో టీఎంసీతో 9 వేల ఎకరాలను పండించే విధంగా ఇరిగేషన్ అధికారులు పనిచేయాలని మంత్రి ఆనం, ఇతర ఎమ్మెల్యేలు సూచించారు. ఈ లెక్కన 41 టీఎంసీలతోనే రెండో పంట సాగును పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కాగా కండలేరు జలాశయంలో 47.530 టీఎంసీల నీరు ఉందని అంచనా వేయగా అందులో డెడ్ స్టోరేజీ 8.40 టీఎంసీలు, నీటి ఆవిరి నష్టాలు 3 టీఎంసీలను మినహాయించారు. చెన్నై తాగునీటి అవసరాలకు 5 టీఎంసీలు కేటాయించగా, పొదల కూరు, రాపూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళ హస్తి, తిరుపతి పట్టణాల్లో తాగునీటి అవసరాలకు మరో 4.750 టీఎంసీలు కేటాయించారు. స్వర్ణముఖి బ్యారేజీకు 2 టీఎంసీలు, పరిశ్రమలకు 1.250 టీఎంసీలు కేటాయించగా కండలేరులో నికరంగా 16 టీఎంసీలు మిగులుతుందని లెక్కించారు. ఈ నీటితో నెల్లూరు జిల్లాలో 35,360 ఎకరాలు, తిరుపతి జిల్లాలో 1,24,640 ఎకరాలు పండించేలా ప్రతిపాదించి, ఆమోదించారు. మే 5వ తేదీ నుంచి సాగునీటిని విడుదల చేయనున్నట్లు ఆనం ప్రకటించారు. ఈలోపు చెరు వులు, బోర్ల కింద నార్లు పోసు కోవచ్చని సూచించారు. ఎక్కువ గా ఆరుతడి పంటలు పండిం చేలా రైతులకు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకూ అవ గాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని జిల్లా అధికార యం త్రాంగాన్ని ఆదేశించారు. అంద రూ సమన్వయంతో పని చేసి నీరు వృథా కాకుండా పొదు పుగా వాడాలని మంత్రి పిలుపు నిచ్చారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ వద్ద 4 లక్షల ఎకరాలకు సరిపడే వరి విత్త నాలు, మెట్ట పంటల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు వినియోగిం చుకోవాలని ఆయన కోరారు.

నీటి కేటాయింపు ఇలా..

ప్రాజెక్టు/ కాలువ	వాస్తవ ఆయకట్టు	నీరిచ్చే ఆయకట్టు	టీఎంసీలు
పెన్నార్ డెల్టా	2,47,000	2,00,000	23.530
కనుపూరు కాలువ	66,000	25,000	2.940
కావలి కాలువ	74,000	74,000	8.710
ఉత్తర కాలువ	98,093	35,000	4.120
దక్షిణ కాలువ	35,490	35,000	4.120
కండలేరు	–	1,60,000	16



ఐఏబీ సమావేశంలో పాల్గొన్న నీటి సంఘాల అధ్యక్షులు, రైతు సంఘ నాయకులు

లస్కర్లు, పూడికతీతపై చర్చ

ఐఏబీలో ఎమ్మెల్యేలతోపాటు ప్రాజెక్టు కమిటీల ఛైర్మన్లు, డీసీల ఛైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతు సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. మెజారిటీ సభ్యులు లస్కర్లు, పూడికతీత సమస్యలపై ప్రశ్నించారు. నీటిని పొదుపుగా వాడాలంటే కాలువల్లో పూడిక తీయడంతోపాటు లస్కర్లను నియమించాచలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం స్పందిస్తూ.. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాలకు (నెల్లూరుసిటీ మినహా) ఓఅండ్ఎం పనులు చేసేందుకు ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ నిధులతో అత్యవసరమైన కాలువలను బాగు చేసుకోవాలని సూచించారు. అలానే మైనర్ ఇరిగేషన్ కాలువలను ఉపాధి హామీ పథకం కింద బాగు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇరిగేషన్, డ్వామా అధికారులు, సాగునీటి సంఘాలు సమన్వయం చేసుకొని అవసరమైన కాలువల్లో వెంటనే పూడికతీత పనులు మొదలుపెట్టాలని ఆదేశించారు. గత ప్రభుత్వం లస్కర్లకు రూ.4.68 కోట్ల వేతనాలు పెండింగ్ పెట్టడమేగాక వారిని తొలగించిందని ఆనం చెప్పారు. ఈ బకాయిలను ఇప్పించేందుకు ఇరిగేషన్, ఆర్థిక శాఖల మంత్రులతో మాట్లాడతామని, లస్కర్లను తిరిగి నియమిస్తామని హామీ ఇచ్చారు. కాగా ఇటీవల ఈదురుగాలులు, వర్షాలతో దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆనంద్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈలు దేశానాయక్, రాధాకృష్ణారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపు చేయాలి



ఒక జిల్లాలో 100 టీఎంసీల నీటి నిల్వ ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా లేదు. ఆ అదృష్టం మనకు దక్కింది. నీరు ఉందని వృథా చేయకుండా పొదుపుగా వాడాలి. చాలా చోట్ల సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. కాబట్టి అవసరమైన మేరకు మాత్రమే నీటిని విడుదల చేయాలి. 2023లో మాదిరి నీరు వృథా చేస్తే సహించేది లేదు. డ్వామా, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షుడు సమన్వయంతో పని చేయాలి.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

ప్రధాన కాలువల గేట్లు దెబ్బతిన్నాయి



కనిగిరి రిజర్వాయర్ నుంచి లక్ష ఎకరాలకు కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ఈ ప్రధాన డిస్ట్రిబ్యూటరీ కాలువల గేట్లు దెబ్బ తిన్నాయి. వీటికి తాత్కాలికంగా నైనా త్వరగా మరమ్మ తులు చేయాలి. చివరి ఆయకట్టు వరకూ నీరిచ్చేందుకు అధికా రులు కృషి చేయాలి. లస్కర్ల అవసరం ఎంతో ఉంది. వారికి జీతా లిచ్చి మళ్లీ విధుల్లోకి తీసుకోవాలి.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

నీటి విడుదలకు ముందే పూడిక తీయాలి



నీరు విడుదల చేయకముందే కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలి. కావలి కాలువ కెపాసిటీ 900 క్యూసెక్కులు కాగా ప్రస్తుతం 650 క్యూసెక్కులకు మించి ప్రవహించడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన రూ.3 కోట్లతో ఆ కాలువలో పూడికతీత పనులు త్వరగా పూర్తి చేయాలి. ఉపాధి హామీ పథకం కింద కాలువలను బాగు చేయాలని నిర్ణయం తీసుకోవడం మంచి ఆలోచన.

- దగ్గుమాటి కృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

సబ్ కాలువలను పునరుద్ధరించాలి



ఉత్తర కాలువ కింద ఉన్న సబ్ కాలువలను గతంలో రాజకీయ కారణాలతో తొలగించారు. ఈ కాలువలను మళ్లీ పునరుద్ధరించాలి. ఉత్తర కాలువ విస్తరణ పనులు చేసేందుకు కాంట్రా క్టర్ ముందుకు రావడం శుభపరిణామం. అయితే ఇక్కడ డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు ప్లానింగ్ లేకుండా విస్తరణ జరుగుతోంది. ఈ విషయంపై అధికారులు దృష్టి పెట్టాలి. గండి పాలెం రిజర్వాయర్‌లో పనులు చేసేందుకు కనీసం హెడ్ఆఫ్‌అకౌంట్ కూడా లేదు.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

'స్వర్ణముఖి'కి 3 టీఎంసీలు ఇవ్వాలి



తిరుపతి జిల్లా పరిధిలోని గూడూరు, సూళ్లూరుపేట, వెంక టగిరి నియోజకవర్గాలపై నీటి కేటాయింపుల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలి. తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వడం మంచి నిర్ణయం. స్వర్ణ ముఖి బ్యారేజీకి 2 టీఎంసీలు మాత్రమే ఇచ్చారు. అక్కడి తాగు, సాగు నీటి అవసరాలకు మరో టీఎంసీ నీటిని ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

- బల్లి కల్యాణ చక్రవర్తి, ఎమ్మెల్సీ

ఈ నగరానికి ఏమైంది!?

- నాలుగు నెలల్లో ఏడు హత్యలు
- వరుస ఘాతుకాలతో ప్రజల బెంబేలు
- చిన్న చిన్న వివాదాలకే దారుణాలు
- నిందితులకు రాజకీయ నేతల అండ?
- ఆపై నిఘా వ్యవస్థ వైఫల్యం
- నేర నియంత్రణలో చేతులెత్తేసిన పోలీసులు

బిడ్డలకు టిఫిన్ తీసుకువస్తానని వెళ్లిన తండ్రి నిమిషాల వ్యవధిలో దారుణహత్యకు గురయ్యాడు. బహిర్భూమికని వెళ్లిన కుమారుడు ప్రత్యర్థుల చేతిలో హతమయ్యాడు. ఇంటికి ఆలస్యంగా వస్తానన్న కుమారుడు మరుసటి రోజు తెల్లవారు జామున మురుగు కాలువలో శవమై తేలాడు.



ఇలా ఇంటిలో నుంచి వెళ్లిన వారు క్షేమంగా తిరిగి వస్తారా!? అన్న నమ్మకం నెల్లూరు నగరంలో సన్నగిల్లు తోంది. చిన్న చిన్న విషయాలు, తగాదాలు దారుణ ఘాతుకాలకు దారితీస్తున్నాయి. నగరంలో ఇటీవల లా అండ్ ఆర్డర్ పూర్తిగా వైఫల్యం కావడం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. డ్రోన్ కెమెరాలతో నేర నియంత్రణ చేస్తా మంటున్న రక్షకభటులు అసలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, బెదిరింపులను కట్టడి చేయలని నిస్సహాయస్థితిలో ఉండిపోతున్నారు. నేర నియంత్రణపై దృష్టి సారిం చాలని జిల్లా పోలీసుల బాస్ పదేపదే ఆదేశిస్తున్నా యంత్రాంగంలో మాత్రం చలనం ఉండటం లేదు. స్టేషన్లలో పంచాయితీలు, రాజకీయ నాయకుల భజన చేయటంతోనే పోలీసులకు సమయం సరిపోతోందన్న విమర్శలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

- వివరాలు 8లో..

పేదలకు 'ఉపాధి' చూపరా!?

3 నెలలుగా కూలి కూడా ఇవ్వడం లేదు

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

సచివాలయ భవనాలు పూర్తి చేసి.. బిల్లులు మంజూరు చేయాలని పట్టు



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ అరుణమ్మ, సభ్యులు

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : 'ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులందరికీ పని దినాలు కల్పిస్తామన్న ప్రకటనలు ఏమయ్యాయి? అసంపూర్తిగా ఉన్న సచివాలయాల భవనాలు ఎప్పటికి పూర్తిచేస్తారు? చేసిన పనులకు బిల్లులు ఇవ్వరా!?' అంటూ పలువురు జడ్పీటీసీ సభ్యులు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమా వేశంలో అధికారులను నిలదీశారు. గురువారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాల యంలో ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం వాడీవేడిగా సాగింది. వాకాడు జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ వాకాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేద కుటుంబాలకు చెందిన దాదాపు 200 మందికి ఉపాధి పథకంలో పని దినాలు కల్పించడం లేదని మండిపడ్డారు. ఛైర్‌పర్సన్ అరుణమ్మ కల్పించుకుని డ్వామా అధికారులు సమాధానం చెప్పాలన్నారు. దీంతో ఏపీడీవో మాట్లాడుతూ అక్కడ స్థానిక సమస్య ఏర్పడిందని, దానిని పరిష్కరించి అందరికీ పని దినాలు కల్పిస్తామన్నారు. అలాగే కలిగిరి, కలువాయి, మర్రిపాడు, కావలి జడ్పీటీసీ సభ్యులు మల్యాద్రి, అనిల్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాఘవులు మాట్లాడుతూ మూడు నెలలుగా ఉపాధి కూలీలకు కూలి ఇవ్వడం లేదని, ఆ నిధులను వెంటనే మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో సచివాలయ భవనాలు, రైతు సేవా కేంద్ర భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామ న్నారు. అలాగే రూ.19 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని, వాటిపైన ప్రభుత్వానికి నివేదికలు పంపి ఉన్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో క్వాలిటీ కంట్రోల్ వ్యవస్థ ఉందా!? లేదా!? అని జడ్పీటీసీ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటివరకు జరిగిన రోడ్లు, కాలువలు ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు చేయక పోవడం, పనులకు సంబంధించి వారు రిపోర్టు లు ఇవ్వకపోవడంతో పనులు చేసి ఏళ్లు గడుస్తు న్న బిల్లులు మంజూరు కావడం లేదన్నారు. దీంతో చిన్న చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై ఛైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ పనులు జరిగేటప్పుడే క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేయాలి కదా ఆ వ్యవస్థ ఏం చేస్తోందని ఎస్ఈని ప్రశ్నించారు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎస్ఈ అశోక్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యారమ, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం

వెంకటాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ భర్త మృతి చెందాడు. వెంకటాచలం మండలం కనుపూరు గ్రామంలో ఈ విషాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కనుపూరులో రాయపనేని రమణయ్య నాయుడు (70), సుబ్బమ్మ (65) దంప తులు నివాసం ఉంటున్నారు. వీరి కుమా రుడు రాయపనేని శేషయ్య బుజబుజ నెల్లూరులో కాపురం ఉంటున్నాడు. అయితే, గురువారం ఉదయం ఎంతసేపటికీ ఇంటిలో నుంచి భార్యాభర్తలు బయటకు రాకపోవడంతో స్థానికులు, బంధువులు అనుమానం వచ్చి పరిశీలించారు. గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న రమణయ్య, సుబ్బమ్మలు హుటాహుటిన నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో రమణయ్య నాయుడు మృతి చెందగా, సుబ్బమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆర్థిక సమ స్యల కారణంగానే దంపతులిద్దరూ విషం తాగి నట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన ఘోరం!

కల్వర్ట్‌ను ఢీకొని లోయలోకి కారు బోల్తా • మంటలు ఎగసిపడి కారు బూడిద

నలుగురు యువకులకు తప్పిన ప్రమాదం



సంగం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నలుగురు యువకులకు త్రుటిలో ప్రాణా పాయం తప్పింది. సంగం - కలిగిరి మా ర్గంలోని సంగంకు 2 కి.మీ దూరంలో బుధవారం అర్ధరాత్రి వేగంగా వస్తున్న ఓ కారు కల్వర్ట్‌ను ఢీకొట్టి లోయలోకి బోల్తా పడింది. దీంతో కారులో మంటలు ఎగసి పడి పూర్తిగా కాలిపోయింది. పోలీసుల కథనం మేరకు.. ఇందుకూరుపేట మండలం నారాయణరెడ్డిపేట, నవలాకులతోటకు చెందిన క్రాంతికుమార్, అజయ్ కుమార్, రేవంత్ కుమార్, జస్వంత్‌లు బుధవారం నెల్లూరు నుంచి కారులో బయలుదేరి కలిగిరి మండలం పెద్దపాడులో జరిగిన స్నేహితుడి పెళ్లికి హాజరయ్యారు. అనంతరం అర్ధరాత్రి కారులో వస్తూ సంగం సమీపంలో ఉన్న ఆశ్రమం మలుపు వద్ద కల్వర్టును ఢీకొట్టి లోయలోకి బోల్తా పడింది. దీంతో కారు ఆయిల్ ట్యాంకు పగిలి మంటలు రేగాయి. స్వల్ప గాయాలైన క్రాంతి కుమార్ తేరుకుని అజయ్ కుమార్, రేవంత్‌ను కారులో నుంచి బయటకు తీశాడు. వీరిలో ఒకరికి చేయి కాలింది. మరోకరికి తలకు గాయమైయింది. అయితే డ్రైవింగ్ చేస్తున్న జస్వంత్ కారులోనే ఇరుక్కుపోయాడు. ఇంతలో అటువైపుగా మరో వాహనంలో వస్తున్న దినేష్, క్రాంతి కుమార్‌లు జస్వం త్‌ను బయటకు తీశారు. అప్పటికే మంటలవల్ల జస్వంత్‌కు చెయ్యి, కాలికి స్వల్ప గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ జహీర్‌ఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మకూరు అగ్నిమాపక దళం మంటలను ఆర్పే సమయానికే కారు పూర్తిగా దగ్ధమయ్యింది. గురువారం ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు ఘటనాస్థలిని పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి
www.andhrajyothy.com

ఆత్మకూరు
ఉదయగిరి

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం

వింజమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అందరి సహకారంతో విజయవంతం అయ్యాయని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్తలు గణపం సుదర్శన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ఈవో శాంతయ్య తెలిపారు. ఈసందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతిఒక్కరికీ దేవస్థానం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9124
వెండి కిలో ధర	రూ. 97,700
వెండి ఒక గ్రాము	రూ.100.70

వేసవిలో పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● పశుసంవర్ధక శాఖ ఏడీ గురుజయంతి



మర్రిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకురాలు గురుజయంతి తెలిపారు.

? వేసవిలో పశుసంపదను కాపాడుకోవడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లో పశువుల దాహర్తి తీర్చటానికి ప్రభుత్వం ప్రతి పంచాయతీలో నీటితొట్లెలను నిర్మిస్తోంది.

? వేసవిలో పశువులకు గడ్డి దొరకటమే కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు ఎలాంటి సహకారం అందిస్తున్నారు.

! రైతులు 50సెంట్లలో గడ్డి సాగు చేసుకుంటే ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 16వేలు ఉచితంగా ఇస్తుంది. మర్రిపాడు, అనంత సాగరం మండలాల్లో 98 ఎకరాలకు రైతులు దరఖాస్తు చేసుకోగా మంజూరయ్యాయి.

? చాలా మంది రైతులు పశువులకు పచ్చిగడ్డి వేస్తుంటారు. వేసవిలో ఎండు గడ్డి వేస్తుంటారు. ఈ రెండూ తప్ప వేరే ప్రత్యామ్నాయ ఆహారం ఏమీ లేదా.

! పశువులకు రోజూ పచ్చిగడ్డి వేస్తే పోషకాలు మెండుగా లభించవు. వీటితో పాటు మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు, వేరుశనగ వంటి దాణాలను వేస్తే పోషకాలతో పాల ఉత్పత్తి పెరుగుతుంది.

న్యూస్ బాక్స్

మేలు జాతి దూడల ప్రదర్శన



పాడి రైతులకు బహుమతులు అందజేస్తున్న పశు వైద్యులు

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవారిపల్లి గ్రామంలో గురువారం రాష్ట్రీయ గోకుల మిషన్ కార్యక్రమంలో భాగంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పశు గణాభివృద్ధి శాఖ విస్తరణాధికారి డాక్టర్ శ్రీనివాసులు, దుత్తలూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి, నందిపాడు ఇన్‌చార్జి పశు వైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మలు దూడల పోషణ, యాజమాన్య పద్ధతుల గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రదర్శనలో మేలు జాతి దూడలను ఎంపికచేసి రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అలాగే పాడి రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

వింజమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం అర్హులైన ఎస్సీ లబ్ధిదారుల నుంచి ఓబీఎంఎస్ఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, మే 10 ఆఖరి తేదీ అని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురు వారం ఆయన మాట్లాడుతూ మండలానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 14 యూనిట్లు మంజూరయ్యాయని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

ఆత్మకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని గురువారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈఈ బి చిన్నస్వామినాయక్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి శివప్రసాద్, కె హజరత్తయ్య, షేక్ మస్తాన్, ఎస్ విజయరామిరెడ్డి, ఎం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

ఆత్మకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా అగ్నిప్రమాదాల నివారణ చర్యలను విద్యార్థులచే చేయించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, లీడింగ్ ఫైర్‌మెన్‌లు ఏ నరసయ్య, ఏ సుధాకర్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆ ఆరు కేంద్రాల్లో గింజ కొంటే ఒట్టు

● ధాన్యం కొనుగోలు కేంద్రాల వైపు చూడని రైతులు ● దళారులకే విక్రయం ● ధర పెరుగుతుందనే ఆశతో నిల్వ



కలువాయిలో రైతులు నిల్వ చేసిన ధాన్యం బస్తాలు.

కలువాయి, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వైపు రైతులు కన్నెత్తి చూడడం లేదు. మండలంలోని చిన్నగోపవరం ధా న్యం కొనుగోలు కేంద్రంలో కేవలం 225 బస్తాలు తప్ప మిగిలిన ఆరు కొనుగోలు కేంద్రాల్లో ఒక్క గింజ ధాన్యం రైతుల వద్ద నుంచి కొను గోలు చేయలేదు. ఈసీజన్‌లో రైతు లు పండించిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు మాదన్న గారిపల్లె, కుల్లూరు, బద్దివోలు, కలువాయి, తెలుగురాయపురం, చిన్నగోపవరం, వెరుబొట్ల పల్లిలో ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. పుట్టి ధాన్యం రూ.19700 మద్దతు ధర ప్రకటించారు. మండలంలో రైతులు వరి కోతలు ప్రారంభించిన సమయంలో బయట మార్కెట్‌లో దళారులు పుట్టి రూ.20 వేలకు పైగానే కొనుగోలు చేశారు. దీంతో రైతులు దళారులకే అమ్ముకున్నారు. ఆతరువాత మార్కెట్లో ధర పడిపోతూ రూ.18వేలకు చేరిం ది. అప్పుడు కొనుగోలు కేంద్రాలలో రూ. 19700 ఉన్నా రైతులు ఎవ్వరూ కూడా కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. గతం లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్మిన రైతులకు మిల్లర్లు చుక్కలు చూపించారు. దీం తో కొనుగోలు కేంద్రాలంటేనే రైతులు భయ పడిపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం రెండు నెలలు నిల్వ చేసుకుంటే ధర పెరుగుతుందనే ఆశతో రైతులు పొలాల్లో నుంచి బయటకు తరలించి ధాన్యం నిల్వ చేసుకున్నారు. ధాన్యం ఆరబోసి నిల్వ చేసేందుకు వేలాది రూపాయలు అదనంగా ఖర్చు చేశారు. ఈ సమయంలో అకాల వర్షాలు కూడా కురుస్తుండంతో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. 80శాతం మంది రైతులు ఈ సీజన్‌లో ధాన్యం అమ్మకుండా పొలాల్లో నిల్వచేసుకుని గిట్టుబాటు ధర కోసం ఆశతో ఎదురు చూస్తున్నారు.

తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తాం

అకాల వర్షం కారణంగా రైతులు నిల్వచేసిన ధాన్యం ఎక్కడైనా తడిచి ఉంటే దాన్ని ప్రభు త్వం ఏర్పాటుచేసిన కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి వీ ప్రతాప్ తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికుల ధర్నా



డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఉదయగిరి, ఏప్రిల్ 17: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఉదయగిరి ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సంస్థలో ఉద్యోగులు, కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, ఆన్‌కాల్ డ్రైవర్ల జీతాలు పెంచాలని, ఓటీ నగదు చెల్లించాలని, మహిళలకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 1/19 సర్క్యులర్‌ను అమలుచేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు కాశీవిశ్వనాథ్, విజయకుమార్, శంకర్, శివకుమార్, మునిరత్నం, మునీర్, రాజా, కిరణ్‌బాబు, వెంకటేశ్వర్లు, మౌలాలీ, రమణయ్య, గౌస్‌బాషా, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి : ఈవోపీఆర్డీ



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి

సీతారామపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఈవోపీఆర్డీ భార్గవి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. చెత్తను రోడ్లమీద, బహిరంగ ప్రదేశాలు, డ్రైనేజిలో వేయరాదని, అతిక్రమించిన వారికి గ్రామ పంచాయతీచే జరిమానా విధించబడుతుందన్నారు. ఇంటిలోని చెత్తను గ్రీన్ అంబాసిడర్‌లకు అందజేయాలని సూచించారు.


భూసార పరీక్షలు నిర్వహించాలి



భూసార పరీక్షల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏవో, వీఏఏలు

ఉదయగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో భాగంగా గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందజేయాలని మండల వ్యవసాయాధికారి అంజనేయులనాయక్ సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లో 340 భూసార పరీక్షలు నిర్వహించాల్సి ఉందన్నారు. భూసార పరీక్షల్లో 12 రకాల మూలకాలతో పరీక్షలు నిర్వహించి రైతులకు పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. భూసార పరీక్షల అనుగుణంగా పంటలు సాగు చేస్తే పెట్టుబడులు తగ్గి దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. ఈకార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్‌ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన



గుండుపల్లి వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీతారామపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా మరో నాలుగు బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జయపురం, గుండుపల్లి, దేవమ్మచెరువు, చింతోడు గ్రామాల్లో తహసీల్దార్ కృష్ణారెడ్డి, బిఎస్ఎన్ఎల్ ఏఈ శ్రీని వాసులు, జేటీవో రామాంజనేయులు పర్యటించి టవర్లకు అనుకూల ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, జిల్లా తెలుగు యువత నాయకుడు సింగాల నాగేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో బాలు, మండల సర్వేయర్ వీఎస్ ప్రశాంత్ ఉన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా టైలర్, తాపీ పని, దోబీ, చర్మకారులకు ఐదు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్రం నిర్వాహకులు ప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ అనంతరం పారితోషికం నగదు, టూల్ కిట్ అందజేయడంతోపాటు బ్యాంకు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9492334643 అనే నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

వక్ఫ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి



నూతన వక్ఫ్ చట్టంపై నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లింలు

ఏఎస్ పేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వక్ఫ్ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని గురువారం ఏఎస్ పేటలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి దర్గా సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని తహసీల్దారు శ్రీరామకృష్ణకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీని జయప్రదం చేయండి

ఉదయగిరి: రాజ్యాంగానికి విరుద్ధంగా చేసిన వక్ఫ్ సవరణ చట్ట బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయగిరి పట్టణంలో చేపట్టే శాంతియుత నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ముస్లిం జేఏసీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ర్యాలీలో సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాలకు చెందిన హిందూ, ముస్లిం, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జి ఫైర్ అధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రమాదాలను నివారించాలన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాల న్నారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి : యూటీఎఫ్



ఆత్మకూరు: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు


ఆత్మకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా గురువారం ఆత్మకూరు యుటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వెస్ట్ మోడల్ స్కూల్, వందూరుగుంట మోడల్ స్కూల్ ఆవాస ప్రాంతాల్లో గల ఇళ్లను సందర్శించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు ఎం గంగాధర్, బి శివప్రసాద్‌రావు, హెచ్ మురళీకృష్ణ, షేక్ ఖాదర్‌బాష, ప్రధానోపాధ్యాయులు సత్తార్ సాహెబ్, అంగన్వాడీ టీచర్ రమణమ్మ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్ సూచించారు. గురువారం ఉపాధ్యాయులతో కలిసి అన్నంపల్లి, కొత్తపల్లి, బిజ్జంపల్లి, లింగంనేనిపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే నాణ్యమైన విద్య, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, రుచి కరమైన భోజనంతో వ్యాన్, సౌకర్యం కల్పిం చడం జరుగుతుందని తల్లిదండ్రులకు వివరిం చారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఉదయగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో సునీత పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుడినరవ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆకుకూరలు, చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. అనంతరం తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన వంటల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, మమత, ధనలక్ష్మి, పద్మ, సౌజన్య, ఏఎన్‌ఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో వ్యాధుల దూరం



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి రవికుమార్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం, వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వ్యవసాయాధికారి రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జి కాకొల్లు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మా ట్లాడుతూ ప్రకృతిలో లభించే ఎరువుల ద్వారా పంటలు, పం డ్లు, కూరగాయలు సాగు చేసుకోవాలని సూచి ంచారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుధా కర్‌రావు, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అవుల అరుణ, ఎస్ఐ రఘునాథ్, సీహెచ్‌వో రాజశేఖర్‌రాజు, ఉద్యాన శాఖాధికారిణి జయశ్రీ, వ్యవసాయ, పొదుపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●కలువాయి: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వీవోఏలు, వ్యవసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయం అసోసియేటర్ చంద్ర మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ సంస్థల ద్వారా గ్రామస్థాయి నుంచి ప్రకృతి వ్యవసాయంపై రైతులను చైతన్యవంతం చే స్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికా రి వీ ప్రతాప్, టీడీపీ మండల కన్వీనర్ జీ వెం కటేశ్వర్లు నాయడు, చల్లా రఘు రామిరెడ్డి, దండు పెంచలయ్య, చల్లా విజయభాస్క రొరెడ్డి, పెరంకొండ మనోహర్ పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S



బీరువా తాళం పగలగొట్టి చిందర వందరగా వేసిన దుస్తులు

పట్టపగలే నాలుగిళ్లలో చోరీలు

- 45 సవర్ల బంగారం, 650 గ్రాముల వెండి, రూ. 1.30లక్షల నగదు అపహరణ
- కావలి వాసులను హడలెత్తించిన దొంగతనాలు
- గంటల వ్యవధిలో ఓ దొంగను పట్టుకున్న పోలీసులు
- మరో ఇద్దరి పరార్



సీసీ పుటేజ్‌లో దొరికిన దొంగలు వాడిన కారు

కావలి రూరల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం పట్టపగలే తాళం వేసి ఉన్న నాలుగిళ్లలో వరుస చోరీలు జరిగాయి. దీంతో పట్టణవాసులు హడలిపోయారు. అప్రమత్తమైన పోలీసులు గంటల వ్యవధిలోనే ఓ దొంగను పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు దొంగలు పరారయ్యారు. పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని వెంగళరావునగర్ రామాలయం సమీపంలో ఉంటున్న నూరు మాలకొండారెడ్డి-లలితమ్మ దంపతులు ఉదయం 11.30 గంటలకు ఇంటికి తాళం వేసి, సమీపంలోని బ్యాంకు లో ఏటీఎం కార్డు తీసుకుని మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంటికి చేరారు. ఇంటిగ్రిల్స్‌కు ఉన్న తాళం పగలగొట్టి దొంగలు లోనికి ప్రవేశించి బీరువాలోని సుమారు 35 సవర్ల బంగారు ఆభరణాలతోపాటు రూ. 40,000 నగదు దొంగిలించుకుపోయారు. అలాగే అదేప్రాంతానికి చెందిన గూడల ప్రతాప్‌కుమార్ జలదంకి మండలం టెంకంవారిపాలెంలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఆయన భార్య ఇంద్రసేన అదే మండలం గట్టుపల్లిలో ఉపాధ్యాయురాలు. ఒంటిపూటబడి కావటంతో ఉదయం 7.30 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లినవారు మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి ఇంటికి వచ్చారు. గ్రిల్స్ తాళంతో పాటు ఇంటి ప్రధానద్వారం తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు బీరువాలోని 650 గ్రాముల వెండి, సవర బంగారం దొంగిలించుకు పోయినట్లు గుర్తించారు.

అలాగే జనతాపేట నార్తులో ఉంటున్న రామకూరి శోభన్‌బాబు ఒంగోలులో పోస్టుమాస్టర్ కాగా, ఆయన భార్య లక్ష్మీప్రసన్నరాణి లింగసముద్రం మండలం పెద్దపవనిలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఉదయం ఇంటికి తాళం వేసి వారు విధులకు వెళ్లగా మధ్యాహ్నం ఇంటికి వచ్చిన లక్ష్మీప్రసన్నరాణి ఇంటి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు బీరువాలోని 9 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు రూ. 88,000 నగదు అపహరించుకు వెళ్లినట్లు గుర్తించారు. అలాగే పట్టణం లోని ఇందిరానగర్‌లో ఉంటున్న మరో ఉపాధ్యాయురాలు అరుణ ఇంటి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు రూ. 2000 నగదుతో ఉడాయించారు. వరుస చోరీల విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీధర్, రెండో పట్టణ సీఐ గిరిబాబు, ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ ప్రభాకర్ బాధితుల నుంచి వివరాలు స్వీకరించారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు. దొంగలు కారులో వచ్చి చోరీలకు పాల్పడినట్లు సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించిన పోలీసులు అప్రమత్తం అయ్యారు.

● పలుజిల్లాల్లో చోరీలు



చోరీ జరిగిన ప్రాంతంలో డీఎస్పీ, సీఐ

ఇటీవల ఇదే ముఠా తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలో సుమారు 25 వరుస చోరీలకు పాల్పడినట్లు పోలీసు విచారణలో తేలింది. ఆరు రోజుల క్రితం ప్రకాశం జిల్లా పొదిలిలో ఇదేవిధంగా వరుస దొంగతనాలు జరగటంతో అప్రమత్తమైన పొదిలి పోలీసులు టెక్నిలజీ ఆధారంగా కడప జిల్లా మైదుకూరు లో దొంగలు వినియోగించిన కారును గుర్తించారు. పోలీసు జీపును రోడ్డుకు అడ్డుపెట్టగా దాన్ని ఢీ కొట్టి దొంగలు కారును అక్కడే వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. పారిపోతున్న వారిని పోలీసులు వెంబడించగా ఇద్దరు దొంగలు పరారయ్యారు. ఒక దొంగను స్థానికుల సాయం తో పోలీసులు పట్టుకున్నారు. కావలిలో చోరీకి గురైన సొత్తును రెండవ పట్టణ సీఐ గిరిబాబు గుర్తించగా సొత్తు మైదుకూరు పోలీసుల స్వాధీనంలో ఉంది.

రోడ్డుప్రమాదంలో డప్పు కళాకారుడి మృతి

మర్రిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డప్పు కళాకారుడు మృతిచెందిన సంఘటన మండలంలోని బాట గ్రామ సమీపంలో 567వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రాములవారి తిరుణాల సందర్భంగా డప్పు కళాకారుడు నల్లిపోగు చిన్నయ్య (58) తమ స్వగ్రామం బాట బీసీ కాలనీలో బుధవారం రాత్రి దేవుని ఊరేగింపులో డప్పు వాయించి తిరిగి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా బద్వేల్ నుంచి దుత్తలూరు వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో చిన్నయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని కృష్ణాపురం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సోలార్ ప్యానల్ స్టార్టర్ల చోరీ

ఉదయగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరాజుపల్లి గ్రామంలోని నరసింహారాజు, ఆంజనేయరాజులకు చెందిన పొలాల్లో ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్ స్టార్టర్లను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 420

చిరుధాన్యాల్లో పోషకాలు మెండు

కలిగిరి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలవారిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగాపాల్గొన్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, సీజనల్ పండ్లు ఆహారంలో చేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చిరంజీవి, శ్రీవాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై కవిత, ఎం దొరసానమ్మ, సుగుణ రామతులశమ్మ, ఆయా కొండమ్మ, ఆశా విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

న్యూస్ బాక్స్

నేటి నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు

బిట్రగుంట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొత్తూరులోని కోదండరామ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం విఘ్నేశ్వరస్వామి, అఖండ పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. శనివారం ఉదయం సీతారాముల కల్యాణం, 20న శ్రీరామ పాదుకల పట్టాభిషేకం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

చీరల పంపిణీ

కందుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని దివివారిపాలెంలో సీతాసమేత కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం జరిగిన సందర్భంగా గురువారం గ్రామవాసి, టీడీపీ నాయకుడు తానికొండ ఆంజనేయులు కుటుంబసభ్యులు చీరలు పంపిణీ చేశారు. ఎస్టీ కాలనీకి చెందిన యాభైమంది మహిళలకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దివి తిరుపతినాయుడు, దివి నరసింగరావు, దివి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈకేవైసీ చేయించండి

లింగసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ కార్డుదారులంతా ఈనెల 30లోగా ఈకేవైసీ చేయించాలని తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి చెప్పారు. గురువారం లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీ యూ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో ఈకేవైసీ పెండింగ్ ఉన్న రేషన్ కార్డుదారులకు డీలర్లు వెంటనే ఈకేవైసీ చేయించాలన్నారు.అలాగే మరణించిన వారి వివరాలు, ఆరేళ్ల లోపు పిల్లల ఈకేవైసీ పెండింగ్ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీటీ కే. శ్రీనివాసులు, కందుకూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కే. చెంచురామయ్య, ఆర్ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తస్రావ రుగ్మతపై అప్రమత్తత అవసరం


డాక్టర్ శ్రీధర్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): హీమోఫిలియా అంటే రక్తం గడ్డకట్టే సామర్థ్యం తక్కువగా ఉండే జన్యుపరమైన రుగ్మత అని రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్ వైద్యులు మనోహర్‌బాబు, పాముూరు శ్రీధర్ పేర్కొన్నారు. కావలి డేకేర్ సెంటర్‌లో గురువారం ప్రపంచ హీమోఫిలియా నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తస్రావత రుగ్మత ఉన్న వారిలో గాయంఅయినపుడు రక్తస్రావం ఆగటానికి, గడ్డకట్టడానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. ఈ పరిస్థితులలో రక్తంలోని భాగమైన ఫ్రెష్‌ప్లోజోన్ ప్లాస్మా ఎక్కిస్తారని వివరించారు. ఈ వ్యాధి ఎక్కువగా పురుషులలో ఉంటుందన్నారు. రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ హీమోఫిలియా ఉన్న వారికి రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో ఉచితంగా రక్తం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్లు మనోహర్‌బాబు, పీ.శ్రీధర్, రమ్య, స్టాఫ్ నర్సు శేషమ్మలను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డీ.రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి, ఆరికట్ల మధుసూదనరావు, బీఎస్ ప్రసాద్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, గొట్టిపాటి మనోరమ, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కందుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడు సాయిబాబా గుడివద్ద భక్తులు గురువారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తమండలి ప్రతినిధులు గట్టమనేని సుబ్బారావు, ఉన్నం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై సమావేశం

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల వెలుగు కార్యాలయంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై సమావేశం జరిగింది. కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య హాజరై ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీపీఎం మునిరత్నం, సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేలంలో పాల్గొనకుండా చేశారు !

ఉలవపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూముల కౌలు వేలంలో తాము పాల్గొనకుండా అధికార పార్టీ నాయకులు, దేవదాయశాఖ అధికారులు అడ్డుకున్నారని గోపాలపురం పూర్వ కౌలు రైతులు ఆరోపించారు. ఇందుకు నిరసనగా ఆలయం ఎదుట డిపాజిట్ కట్టిన స్లిప్పులు చూపిస్తూ నిరసన తెలిపారు. ఇదంతా ఎమ్మెల్యే నాగేశ్వరరావు సమక్షంలో జరిగిందని వారు వాపోయారు.

ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారం చరిత్రాత్మకం


కందుకూరు : విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు


కావలి : మాట్లాడుతున్న కాకి ప్రసాద్ తదితరులు

కందుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ సీఎం చంద్రబాబు ఆర్డినెన్స్ జారీచేయటం చరిత్రాత్మకమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా వర్గీకరణకు పూర్తిస్థాయి చట్టబద్ధతతో ప్రభుత్వం జీవో జారీచేయటం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. ఎస్సీలలోని అన్నివర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందాలన్న సంకల్పంతో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం నిరుపేద ఎస్సీల గుండెల్లో ఆయనకు స్థానం కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో దామా మల్లేశ్వరరావు, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, తాటిపర్తి రామకృష్ణ, కావలి ఏసుదాసు, పులి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణకు మంత్రివర్గ ఆమోదం హర్షణీయం

కావలి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని టీడీపీ ఎస్సీసెల్ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు కాకి ప్రసాద్ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయనతోపాటు టీడీపీ ఎస్సీసెల్ కావలి నియోజకవర్గ అధ్యక్షుడు డీ. దేవకుమార్, పట్టణ అధ్యక్షుడు ఏ. సూర్యప్రకాష్ విలేకరులతో మాట్లాడారు. 2000లో తొలుత వర్గీకరణ చేసిన రామచంద్రరావు కమిషన్, ఉషామెహ్రా కమిషన్‌లు వేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. మొత్తం ఎస్సీలను మూడు విభాగాలుగా విభజించి అందరికీ సమన్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకున్నదన్నారు. దీంతో ఎస్సీలలోని 59 కులాలకు సమన్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

● ఆర్డినెన్స్ జారీపై కృతజ్ఞతలు

లింగసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తూ సీఎం చంద్రబాబు ఆర్డినెన్స్ జారీ చేయడంపై నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఏ చినకొండయ్య, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీ. చిన ముసలయ్య కృతజ్ఞతలు తెలిపారు.గురువారం వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఎస్సీలలోని 59 ఉపకులాలను వర్గీకరించాలని మంద కృష్ణమాదిగ అలుపెరగని పోరాటం చేశారన్నారు.సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో సీఎం చంద్రబాబు ఎస్సీలను వర్గీకరిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

క్రమశిక్షణ,పట్టుదలకు క్రీడలు దోహదం


క్రికెట్ విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, పట్టుదలకు క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మీ కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మూడురోజులపాటు జడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో జరిగిన జూనియర్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. సంస్థ అధ్యక్షుడు రాయపాటి దిలీప్ అధ్యతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్, ట్రోఫీ అందచేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడలపై దృష్టి పెట్టి, క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ముసునూరు వారియర్స్ జట్టు ఎన్ లెవెన్ లయన్స్ జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో ముసునూరు వారియర్స్ విన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ చౌదరి, నికిత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ఆర్టీసీ డిపో వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేస్తున్న ఉద్యోగులు


కావలిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు గురువారం డిపో వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ, ధర్నా చేశారు. యూనియర్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు కుందుర్తి వెంకటేశ్వర్లు, రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్క్యులర్ 1-2019ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్ ఆపాలని, నాలుగేళ్ళుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని, గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, మెడికల్ లీవ్‌కు పూర్తి జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి మధుసూదనరావు, ముఖ్య సలహాదారుడు ఎస్‌డివై ఘని, భాస్కర్‌రావు, శ్రీనివాసులతో పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరించాలి


కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

బిట్రగుంట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటింటి నుంచి తడి,పొడి చెత్త సేకరించేలా ప్రతి గ్రామకార్యదర్శి చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీధర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీలవారీగా రికార్డులను పరిశీలించి, ఇంటి, ఇతర పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మండలంలోని బోగోలు, తాళ్లూరు, ఎస్‌జీవీ కండ్రిక, జక్కేపల్లిగూడూరు గ్రామాల్లో ప్రస్తుతం ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేపట్టామని తెలిపారు. క్రమంగా ఏబీకండ్రికలోనూ ప్రారంభిస్తామన్నారు. ఇటీవల బోగోలు కార్యదర్శిపై మేరీ అనే మహిళ అధిక బిల్లు వసూలు చేసి తక్కువ బిల్లుకు రసీదు ఇచ్చారని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయమై విచారణకు సిఫారసు చేశామన్నారు. బిల్లులు వసూళ్లలో అవకతవకలు జరిగితే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, డీఎల్ పీవో రాధామాధవీలత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పొగాకు కూలీల ప్రయాణం



కలిగిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రెక్కాడితేగాని డొక్కాడని బడుగుజీవులు పొట్టచేతపట్టుకొని సుదూర ప్రాంతాల నుంచి పొగాకు పనులకోసం మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు వలస వస్తుంటారు. పొగాకు తోటల్లో ఆకురెలిచిన తరువాత కూలీలు వాటిని బ్యారన్ వద్దకు చేర్చి కర్రలకు అల్లి క్యూరింగ్ చేస్తారు. ఈ క్రమంలో రైతులు తమ తోటల్లోని పొగాకును ట్రాక్టర్‌లో లోడ్ చేసి కొని కూలీలను ఎక్కించుకొని బ్యారన్ వద్దకు చేర్చడానికి ప్రయాణం చేస్తారు. ఇలా ట్రాక్టర్ ట్రక్కులో పొగాకు లోడ్ వద్ద ప్రమాదకరంగా కూర్చొని ప్రయాణం చేయడం జరుగుతుంది. ఏదైనా ప్రమాదం జరిగితే వారిని ఆదుకునే వారుండరు.

'ఏసు కోసం పరుగు'ను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న పాస్టర్లు శ్యాంసన్‌బాబు, నాగరాజు

బిట్రగుంట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మృత్యుంజయుడు ఏసుక్రీస్తు కోసం పరుగు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ. పాస్టర్ శ్యాంసన్‌బాబు, కార్యదర్శి రెవ. సీహెచ్.నాగరాజు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ బోగోలు మండల ఐక్యపాస్టర్ల సంఘాలు, పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఏడులోపు ఇబ్రహీంపేట పెట్రోల్ బంక్ వద్ద నుంచి బోగోలు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం అన్ని సంఘాల్లో క్రీస్తు శిలువ ఉపవాస ప్రార్థనలు ఉంటాయని తెలిపారు. ఆదివారం మరణాన్ని జయించిన మృత్యుంజయుడు ఏసు కోసం ప్రత్యేక ప్రార్థన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఏ.స్తెపెన్, ఎబినేజర్, బీ.రవికుమార్, జీ.రమేష్, పీ.శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు, మార్కులే జీవితం కాదు


విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్న వైద్య నిపుణులు అశోక్

కలిగిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా విద్యాలయంలో గురువారం నెల్లూరు డివిజన్ పరిధిలోని కలిగిరి, కొండాపురం, కావలి ఏఎస్‌పేట, నందిపాడు, మర్రిపాడు,సీతారామపురం కేజీబీవీ కేంద్రాల్లో ఇటీవల 10వతరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులకు మానసిక ధైర్యం అనే అంశంపై అవగాహన నిర్వహించారు. పరీక్షలు రాసిన విద్యార్థినుల్లో ఫలితాలపై మానసికస్థైర్యం కలిగించడానికి మానసిక వైద్య నిపుణులు పీ ఆశోక్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పరీక్షల్లో సక్సెస్, ఫెయిల్యూర్ సాధారణమని, పరీక్ష ఫలితాలు ఏవిధంగా ఉన్నా వాటిని తమ భవిష్యత్‌కు అనుగుణంగా మలుచుకోవడానికి ప్రయత్నాలు చేసుకొని, ముందుకు సాగిపోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేతు సుప్రియ, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

పంది చనిపోయి దుర్వాసన పట్టించుకోని అధికారులు

లింగసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపవని జెండా చెట్టు సమీపంలోని ఇళ్ల వెనుక పంది చనిపోయి దుర్వాసన వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు షేక్ మహ్మద్ బాషా మరికొందరు గురువారం తెలిపారు. బుధవారం రాత్రి పంది చనిపోగా, పంచాయతీ కార్యదర్శి రషీద్‌కు తెలియజేశామని, సాయంత్రంలోపు పందిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారని, కానీ తొలగించలేదన్నారు.పందిని తొలగించక పోవడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని చెప్పారు.ఈ విషయమై రషీద్ అహమ్మద్‌ను వివరణ కోరగా పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు గురైందని,శుక్రవారం ఉదయాన్నే తొలగిస్తామని చెప్పారు.

మంచినీటి బోరుకు రాజకీయ గ్రహణం

● ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీ వాసులు


వెంగళాపురం ఎస్సీ కాలనీలో మరమ్మతులకు గురైన మంచినీటి బోరు

లింగసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురం ఎస్సీ కాలనీ(కొమ్ము పాలెం)లోని మంచినీటి బోరు మోటారు నాలుగు నెలల క్రితం మరమ్మతులకు గురైంది.దీంతో కాలనీవాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ బోరుకు కొత్త మోటారు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈని కోరారు. ఎస్‌ఈ ఆదేశాల మేరకు పది రోజుల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ బోరును సందర్శించి కొత్త మోటారును ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే పంచాయతీ సర్పంచి వైసీపీకి చెందిన వ్యక్తి కావడంతో కొత్త మోటారు కొని బోరుకి బిగించి నీరందిస్తే బిల్లులు చేయనని చెబుతున్నట్లు తెలిసింది.దీంతో అధికారులు ఏమీ చేయలేక పోతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా పాలకులు జోక్యం చేసుకుని మోటారు బిగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక ప్రజావేదికలో దస్త్రాలు పరిశీలిస్తున్న పీడీ గంగాభవాని

వలేటివారిపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఎదుట గురువారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికను తూతూ మంత్రంగా నిర్వహించారు. సమావేశానికి డ్వామా పీడీ గంగాభవాని, జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి హాజరయ్యారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. మండలంలో 1216 పనులకు రూ. 14.70 కోట్లు మంజూరు చేశారు. అయితే ఎక్కడా అక్రమాలు జరగలేదనట్లు రూ.2 లక్షలు మాత్రమే రికవరీకి ఆదేశించారు. లింగపాలెం, కళవళ్ల పంచాయతీల్లో పైసా కూడా అక్రమాలు జరగలేదని అధికారులు తెలిపారు. కాగా ప్రజావేదికలో ఉపాధి హామీ సిబ్బంది, అధికారులు తప్ప జనం లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజావేదిక ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ జరగాల్సిన ఉండగా మూడు గంటల్లోపే పూర్తి చేశారు ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ ఆవులయ్య, ఏపీడీ బాబూరావు, ఎంపీడీవో నరేంద్ర దేవ్, ఏపీవోలు ఉమామహేష్, దయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలి


అగ్నిప్రమాదాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

కావలి రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): గ్యాస్ ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకుని, విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జీ. ప్రభాకర్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, విద్యుత్ ప్రమాదాలతోపాటు ఈత కొట్టడానికి వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నివారించాలన్న దానిపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'టీఆర్‌ఆర్'లో అధ్యాపకులకు సన్మానం


టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ

కందుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు గ్రూప్ సబ్జెక్టులు, ఒకేషనల్ కోర్సుల్లో నూరుశాతం మార్కులు సాధించేలా కృషిచేసిన అధ్యాపకులను గురువారం సన్మానించారు. ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో గణితం, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, ఒకేషనల్ కోర్సుల అధ్యాపకులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సుల్లో తమ విద్యార్థులు నూరుశాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. అధ్యాపకులు ఎంతో నైపుణ్యంతో విద్యాబోధన చేయటంతోపాటు విద్యార్థులపట్ల ప్రత్యేకశ్రద్ధతో వారికి తర్ఫీదునివ్వటం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

కావలిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి) సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ అనుబంధ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పే ఆలోచనను ప్రభుత్వం మానుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. గతంలో ఏజెన్సీల విధానంతో కార్మికులు ఎంత ఇబ్బంది పడ్డారో అందరికీ తెలిసిన విషయమేన్నారు.ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించడం శోచనీయమన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పెంచలయ్య, మధుసూదన్‌రావు, టీ. శీనయ్య, బీ. రమేష్, ఓ. రమేష్, బాబు, బాలయ్య, చిన్నమ్మ, అనిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలిలో సరికొత్త స్కామ్

- మున్సిపాలిటీలో ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిల పేరుతో వసూళ్లు
- అధికారులమంటూ వేర్వేరు నెంబర్ల నుంచి ఫోన్లు
- పోలీసులకు అధికారుల ఫిర్యాదు
- వ్యాపారుల వివరాలు బయటకు..
- పురపాలక సంఘం ఉద్యోగులు పనేనా ?

కావలి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కటానికి ఎంతటికైనా కొందరు సిద్ధపడుతున్నారు. ఇళ్లలో కూర్చుని సెల్‌ఫోన్ల ద్వారా ప్రజలను మోసం చేసే వారి సంఖ్య ఎక్కువైంది. ఇటీవల కొందరు వ్యక్తులు 'మీరు లాటరీ గెలిచారు.. మీ బ్యాంకు ఖాతా నిలిచి పోయింది, మీకు రుణం వచ్చింది'... అంటూ ఫోన్లు చేసి ఓటీపీ నెంబర్లు అడిగి వారి బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదును కాజేస్తున్న ఘటనల గురించి విన్నాం. అయితే ఈ మోసాలపై ప్రజలను చైతన్యం చేయటంతో ఇప్పుడు అవి చాలా వరకు ఆగిపోయాయి. తాజాగా కావలిలో సరికొత్త మోసానికి కొందరు తెరతీశారు.


కావలి మున్సిపల్ కార్యాలయం

● వ్యాపారుల వివరాలు బయటకు..

ఈప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులు కావలిలో ఉన్న వ్యాపారులకు ఫోన్లు చేసి ట్రేడ్‌లైసెన్స్ బకాయిలు అడుగుతున్నారంటే వ్యాపారుల వివరాలు వారికి ఎలా తెలిశాయనేది సర్వత్రా చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలో ప్రస్తుతం కాని, గతంలో కాని పని చేసిన ఉద్యోగులే వారి వివరాలు, వారి ఫోన్ నంబర్లు ఇచ్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాలిటీలో వివరాలు బయటకు వెళ్లతున్నాయనే అనుమానంతో ఇటీవల ఇద్దరు ఆర్‌ఐలను వారి పోస్టుల నుంచి తప్పించి ఇతరులకు బాధ్యతలను అప్పగించారు. అసలు ట్రేడ్ లెసెన్స్‌ల బకాయిల పేరుతో ఫోన్ కాల్స్ చేస్తున్న ముఠా ఎవరు ? దాని వెనుక ఎలాంటి శక్తులు ఉన్నాయనేది ? ఈ రెండు ఫోన్ నెంబర్ల ఆధారంగా పోలీసులు సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెల్లడవుతాయి.

● ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిల వసూళ్ల పేరుతో..

మున్సిపాలిటీలో ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిల వసూళ్ల పేరుతో సరికొత్త స్కామ్‌కు కొందరు శ్రీకారం చుట్టారు. తాజాగా ఈనెల 13 నుంచి అక్రమ సంపాదన కోసం పట్టణంలోని వ్యాపారులను, కొందరు లక్ష్యంగా చేసుకుని వారికి 63043 26727, 91626 68264 నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తున్నారు. 'మీరు ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిలు ఉన్నారు. వాటిని వెంటనే ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్‌పే చేయండి. లేదా మేము పంపే క్యూర్ కోడ్‌కు స్కాన్ చేసి పంపండి'అని అడుగుతున్నారు. దీంతో కొందరు వ్యాపా రులు తాము ఇటీవలే కట్టామని చెబుతుం డగా, వాటి రసీదులను ఫోన్‌పే ద్వారా పంపండని చెబుతున్నారు. ఓ వ్యాపారి రసీదును ఫోన్‌పే ద్వారా ఆ అగంతకులకు పంపగా, దాన్ని ఇతర వ్యాపారులకు పంపి 'మీరు ఫోన్‌పే, క్యూఆర్‌కోడ్ ద్వారా డబ్బులు చెల్లిస్తే, మీకు ఇలాంటి రసీదులు పంపుతామని చెబుతున్నారు.

● కమిషనర్ పేరుతో ఫోన్లు

మరి కొంతమంది వ్యాపారులయితే 'మీరు ఎవరు.. ఎక్కడ నుంచి ఫోన్ చేస్తున్నారు' అని అడగ్గా, తాను మున్సిపల్ కమిష నర్ కిరణ్‌ను మాట్లాడుతు న్నానని చెప్పడంతో వ్యాపారులకు అనుమా నాలు వచ్చాయి. కమిష నర్ కిరణ్ ఎప్పుడో బదిలీ కావటం, ఇప్పుడు ఆయన పేరు చెప్పడం, దానికి తోడు భాషలో తేడా ఉండటంతో వ్యాపారులు ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ మున్సిపల్ ఉద్యోగులు ఎవరూ ఫోన్ ద్వారా ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిలు వసూలు చేయటం లేదని, మీరు ఎవరికీ ఫోన్ ద్వారా కాని, క్యూఆర్ కోడ్ ద్వారా కాని చెల్లింపులు చేయవద్దని ఓ ప్రకటన విడుదల చేశారు.

● పోలీసులకు ఫిర్యాదు

అంతేకాక మున్సిపల్ రెవెన్యూ అధికారి ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ ద్వారా ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్‌కు లిఖిత పూర్వకంగా ఈనెల 15న ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు లోతుగా విచారణ చేపట్టగా ఒక ఫోన్ నెంబరు హైదరాబాద్ వాసిగా గుర్తించారు. రెండో ఫోన్ నెంబరును ఇంకా గుర్తించే పనిలో ఉన్నారు.


సీఐ ఫిరోజ్‌కు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ ఆర్వో ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ (ఫైల్)

జిల్లాలో ఇళ్లులేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు సొంతింటిని నిర్మించి ఇస్తామని గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. నిధులు దుర్వినియోగమయ్యాయే తప్ప... పేదలకు ఇళ్లు ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల ఇళ్లపై ప్రత్యేకశ్రద్ధ చూపడం, వచ్చే ఏడాది మార్చిలోపు అసంపూర్తిగా ఉన్న ఇళ్లన్నింటినీ పూర్తి చేయాలన్న లక్ష్యం పెట్టడం, ఈ విషయాలపై ఇటీవల జిల్లాకు వచ్చిన గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి సమీక్ష చేయడం జరిగింది. ఈ క్రమంలో పెండింగ్ ఇళ్ల నిర్మాణాలపై కదలిక వచ్చింది.

\- నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి)


పొదలకూరులో పునాదులకే పరిమితమైన జగనన్న కాలనీ ఇళ్లు

పేదల గూడుకు మోక్షం కలిగేనా ?

- బేస్‌మట్టాలకే పరిమితమైన కాంట్రాక్టర్లు కట్టిన ఇళ్లు
- అత్యధికభాగం నాసిరకమే
- గృహనిర్మాణ మంత్రి సమీక్షతో కదలిక

గత వైసీపీ ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని భారీగా నిధులు ఖర్చు చేశారు. ఇళ్ల నిర్మాణానికి ముందుకురాలేని నిరుపేదలకు, కాంట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు చెందిన లబ్ధిదారుల ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించింది. జిల్లాలో 29071 ఇళ్లను ఆప్షన్ - 3 ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇందులో ఆత్మకూరు నియోజకవర్గంలో 2092 ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించగా, కేవలం 98 ఇళ్లకు మాత్రమే శ్లాబ్ వేశారు. 68 ఇళ్లు పూర్తి చేశారు. మిగతా ఇళ్లు బేస్‌మట్టం, రూఫ్‌లెవెల్‌లో ఆగిపోయాయి. కందుకూరులో 968 ఇళ్లు కాంట్రాక్టర్లకు అప్పగించగా, 413 ఇళ్లు పూర్తయ్యాయి. మిగతా ఇళ్లు బేస్ మట్టం, రూఫ్‌లెవెల్‌లో నిలిచిపోయాయి. కావలిలో 6,056 ఇళ్లు కేటాయించగా 2020 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కోవూరులో 2506 ఇళ్లకుగాను 642 ఇళ్లు మాత్రమే కాంట్రాక్టర్లు పూర్తి చేశారు. నెల్లూరు నగరంలో 7407 ఇళ్లకుగాను 1365 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. నెల్లూరు రూరల్‌లో 5896 ఇళ్లకుగాను 1493 ఇళ్లు, సర్వేపల్లిలో 1425 ఇళ్లకుగాను 28 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. వెంకటగిరిలో 625 ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించగా, ఒక ఇంటిని కూడా పూర్తి చేయలేదు. ఉదయగిరిలో 1616 ఇళ్లకుగాను ఏడు ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. దీంతో 29,071 ఇళ్లకుగాను కేవలం 6036 ఇళ్లు మాత్రమే పూర్తి కాగా, మిగిలిన 23,035 ఇళ్లు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. వీటికి సంబంధించి చేసిన పనుల కంటే కాంట్రాక్టర్లకు బిల్లులు అదనంగా మంజూరు చేసినట్లుగా పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి.

● మంత్రి సమీక్షతో కదలిక

జిల్లాలో కాంట్రాక్టర్లు చేట్టిన వదిలేసిన ఇళ్లన్నింటిని వారిచేతే పూర్తి చేయించాలని, చేయనిపక్షంలో వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కలెక్టర్, హౌసింగ్ అధికారులకు గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి ఆదేశించారు. అలాగే అసంపూర్తి నిర్మాణాలు ఎక్కువగా నాసిర కంగా ఉన్నాయని, అవి నిర్మాణా లకు పనికి వస్తాయో, లేదో పరిశీలించి అన్నీ ఇళ్లను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. దీంతో నిలిచి పోయి ఉన్న ఇళ్ల నిర్మాణా లపై అధికారులు కసరత్తు ప్రారంభించారు.

నాసిరకం నిర్మాణాలపై చర్చ

ఇళ్ల నిర్మాణాల బేస్‌మట్టం కేవలం మూడు, నాలుగు అడుగుల్లోనే, ఫిటింగ్‌లు లేకుండా వేసి ఉన్నందున, మరీ నాసిరకంగా ఉన్నందున ఇళ్ల నిర్మాణాలకు ఎంతలోతు బేస్‌మట్టం ఏర్పాటు చేయాలన్నదానిపై హౌసింగ్‌శాఖ పీడీ, పంచాయతీరాజ్ ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు సమావేశమై చర్చించారు. కనీసం ఆరుఅడుగుల మేర బేస్ మట్టం ఉంటేనే నాణ్యతగా ఉంటుందని, వారు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. అలాగే అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల నాణ్యతపై థర్డ్ పార్టీ ద్వారా పరిశీలన చేయించి నాణ్యతగా ఉంటే నిర్మాణాలు కొనసాగించాలని, లేకపోతే వాటిని కూల్చివేసి సదరు కాంట్రాక్టర్లతోనే నిర్మాణాలను పూర్తి చేయించాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. దీంతో కాంట్రాక్టర్లతో గతంలో పనిచేసిన హౌసింగ్ ఏఈలు, సచివాలయ సిబ్బంది ద్వారా పిలిపించి పనులు పూర్తి చేయించాలని కూడా నిర్ణయించారు. అందుకు అంగీకరించని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టి వారి నుంచి దుర్వినియోగమైన సొమ్మును రాబట్టి సకాలంలో పనులను పూర్తి చేయించాలన్న ఆలోచనలో పాలకులు, అధికారులు ఉన్నారు. దీంతో ఆగి ఉన్న పేదల ఇళ్లలో మళ్లీ కదలిక మొదలైంది.

వేణుగోపాలుడి ఆలయ భూముల వేలం

- ఏకపక్షంగా సాగిందని వైసీపీ శ్రేణుల నిష్క్రమణ
- దోపిడీకి విముక్తి లభించిందన్న గోపాలపురం గ్రామస్థులు
- గతం కంటే పెరిగిన ఆదాయం

ఉలవపాడు, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూములకు గురువారం ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. కందుకూరు మండలం మదనగోపాలపురంలో ఆలయానికి చెందిన 172.40 ఎకరాల దేవుడి మాన్యం ఉంది. మూడేళ్లకు ఒకసారి వేలం నిర్వహించి కౌలుకు ఇస్తుంటారు. గురువారం జరిగిన వేలంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 48 మంది రైతులు వేలంలో ఆ భూములను దక్కించుకున్నారు. 172.40 ఎకరాలకు ఏడాదికి రూ.18,50,800 చొప్పున మూడేళ్లపాటు ఆలయానికి రూ.55,52,400 ఆదాయం సమకూరనుంది. ఈ ఏడాదికి వచ్చిన కౌలు నగదు ఆలయం పేరిట ఉన్న బ్యాంక్ ఖాతాలో జమచేయనున్నట్లు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవో శ్రీనివాసులు తెలిపారు.

● పెరిగిన ఆదాయం

ఈ భూములకు గత ఏడాది నిర్వహించిన వేలంలో ఆలయానికి వచ్చిన కౌలు రూ.7,78,600 కాగా, గురువారం జరిగిన వేలంలో రూ.10,72,200 ఆదనంగా ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు.

● 40 ఏళ్ల దోపిడీకి విముక్తి

ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఆలయ భూములను ఎకరాకి రూ.1000 చెల్లించి ఏళ్ల తరబడి స్వామివారికి చెందాల్సిన ఆదాయాన్ని దోచుకుతిన్నారని కౌలు దక్కించుకున్న రైతులు పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా ఆల యానికి రావాల్సిన ఆదాయానికి గండి కొట్టారని, ఇప్పుడు కూడా అలాంటి ప్రయత్నాలు కుదరక వేలంను బహిష్కరించి అధికారులపై, అధికారపార్టీపై నిందుల వేస్తున్నారని వారు వివరించారు.

● వైసీపీ శ్రేణుల నిష్క్రమణ

పోలీసు బందోబస్తుతో అధికారపార్టీ నాయకులు వేలం ను ఏకపక్షంగా సాగిస్తున్నారని ఆరోపిస్తూ మదనగోపాలపురం గ్రామానికి చెందిన (గతంలో కౌలు సొంతం చేసుకున్నవారు) వైసీపీ శ్రేణులు వేలం నుంచి నిష్క్రమించారు. అధికారపార్టీ చెప్పినట్లు ఆలయ అధికారులు వేలం నిర్వహించి, అన్యాయం చేశారని వారు వాపోయారు. తమకు జరిగిన అన్యాయాన్ని కోర్టు ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తామని వారన్నారు.


వేలం పాటలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఓ ప్రైవేటు వైద్యురాలి నిర్వాకం.. గర్భం పోగొట్టుకున్న మహిళ

- తన సిబ్బందితో ఫోన్ ద్వారా చికిత్స చేయించిన డాక్టర్
- వాడిన మందుల వివరాలు ఇవ్వని వైనం
- గర్భాస్రావం కావడంతో బాధితుల లబోదిబో

అల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేటు వైద్యురాలి నిర్వాకం ఓ మహిళ అమ్మతనాన్ని కోల్పోయేలా చేసింది. ఫోన్‌లో తన సిబ్బంది ద్వారా చికిత్స చేయించిన వైద్యురాలి కారణంగా మూడు నెలల గర్భాన్ని పోగొట్టుకున్న ఘటన గురువారం వెలుగుచూసింది. బాధితురాలి కథనం మేరకు.. అల్లూరుకు చెందిన ఓ మహిళ నాలుగేళ్ల క్రితం ఓ మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి మరో సంతానం కోసం ఎదురుచూడగా ఇటీవల గర్భం దాల్చింది. మూడో నెల కావడంతో ఈ నెల 15న కడుపులో అసహనంగా ఉండటంతో అల్లూరులోని బాపూజీ పార్కు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లింది. డాక్టర్ లేకపోవడంతో అక్కడున్న సిబ్బంది ఆమెకు గల సమస్యను పరిశీలించి వివరాలను ఫోను ద్వారా వైద్యురాలికి చేరవేశారు. ఆమె సూచనల మేరకు ఓ ఇంజక్షన్‌కు రూ.వెయ్యి, మందులకు రూ.2 వేలు తీసుకొని ఇంజక్షన్ వేసి మందులు ఇచ్చి పంపించారు. ఈ మందులను వాడిన గర్భిణికి అసహనం కాస్త నొప్పిగా మారి బుధవారం అర్ధరాత్రి తర్వాత తీవ్ర నొప్పితో భరించలేక అల్లూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడా ఓ ఇంజక్షన్‌తోపాటు మందులు ఇచ్చి తగ్గిపోతుందని పంపించేశారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా ఏ మందులు వినియోగించారని, సదరు మందుల తాలూకు ప్రిస్క్రిప్షన్ ఇవ్వమని కోరగా అవి లేకుండానే వైద్యం చేశారని బాధితులు తెలపడంతో సదరు వైద్యురాలు గర్భిణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే నొప్పి తీవ్రమై అక్కడే అబార్షన్ అయిపోయింది. దీంతో బాధిత మహిళ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఇటువంటి అవగాహన లేని నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళతోపాటు కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఎస్‌పీఎల్ విజేత రూరల్ లయన్స్

● రన్నరప్‌గా నిలిచిన గూడూరు చాలెంజర్స్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సింహ పురి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీ ఎల్) టీ-20 క్రికెట్ చాంపి యన్‌షిప్ విజేతగా నెల్లూరు రూరల్ లయన్స్ జట్టు నిలి చింది. బుజబుజ నెల్లూరులోని సీఏపీ క్రీడామైదానంలో గురువారం జరిగిన ఫైనల్‌లో రూరల్ లయన్స్, గూడూరు రాయల్ చాలెంజర్స్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన రూరల్ టీం 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. అనంతరం గూడూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 196 పరుగులు మాత్రమే చేయడంతో 18 పరుగుల తేడాతో లయన్స్ జట్టు కప్పును కైవశం చేసుకుంది. జట్టులోని పూర్ణ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. బహుమతి ప్రదానోత్సవానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి హాజరై విన్నర్స్, రన్నర్స్‌కు ట్రోఫీలు అందచేశారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఎన్‌డీసీఏ కేర్‌టేకర్ డీ శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి కే మునిగి రీష్, టోర్నీ నిర్వాహక కమిటీ చైర్మన్ కే వంశీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌పీఎల్ ట్రోఫీని అందుకుంటున్న నెల్లూరు రూరల్ లయన్స్ జట్టు

పొగాకు ధరలు

మర్రిపాడు : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 220 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు. 521 బేళ్ల అమ్మకాలు జరిగాయి.

ఈ నగరానికి ఏమైంది!?

- నాలుగు నెలల్లో ఏడు హత్యలు
- వరుస దారుణాలతో ప్రజల బెంబేలు
- చిన్న చిన్న వివాదాలకే దారుణాలు
- నిందితులకు రాజకీయ నేతల అండ?
- ఆపై నిఘా వ్యవస్థ వైఫల్యం
- నేర నియంత్రణలో చేతులెత్తేసిన పోలీసులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతతకు నిలయమైన నెల్లూరులో వరుస హత్యలు నగర ప్రజలకు కునుకులేకుండా చేస్తోంది. జరిగే హత్యలు కూడా కిరాతకంగా కత్తులతో నరికి, పొడిచి, రక్తం ఏరులై పారేలా విచక్షణా రహితంగా గాయపరిచి చంపుతుండటంతో నగరవాసులు తాము నెల్లూరులో ఉన్నామా!? లేదా నేరాలకు అడ్డాగా మారిన రాష్ట్రాల్లో ఉన్నామా అనే మీమాంశలో ఉండిపోతున్నారు. చిన్న చిన్న కారణాలతోనే హత్యలు జరుగుతుండటం, అధికంగా యువతే ప్రాణాలు కోల్పోవడంతోపాటు హత్య చేసిన వారు యువకులే కావడం చూస్తుంటే యువత ఏ మార్గంలో నడుస్తోందో స్పష్టమవుతోంది.

● కత్తులు, మారణాయుధాలతో...

నగరంలో బాలుర నుంచి యువత వరకు బొడ్డుల్లో, వీపు వద్ద, నడుము ఇరువైపులా, జేబుల్లో కత్తులు, మారణాయుధాలు పెట్టుకొని బయటకు రావడం స్టైల్‌గా మారిపోయింది. చిన్న విషయాలకు కూడా కత్తులను బయటకు తీసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. హత్యలు, హత్యాయత్నాలు జరగడంతో బయట వస్తున్న సంఘటనలు తక్కువేనని బయటకు రాని ఘటనలు ఎన్నో ఉన్నాయని పలువురు అంటున్నారు. ఒకప్పుడు నగరంలో ఓ హత్య జరిగింది అంటే జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారేది. ఇప్పుడు రొటీన్ అయిపోయింది. పది రోజులకు ఒక హత్య అన్నట్లుగా నగరంలో వరుస హత్యలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఏడు హత్యలు జరిగాయి.

● నాయకుల భరోసా

హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడిన నిందితులకు కొందరు రాజకీయ పార్టీ నాయకులు అండగా నిలుస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఘటన జరిగిన వెంటనే పోలీసుల కంటే ముందే కొందరు నాయకుల అనుచరులు నిందితులను కలిసి 'మీకు బెయిల్ ఇప్పిస్తాము.. పోలీసులకు లొంగిపోయిన వెంటనే దెబ్బ పడకుండా చూసుకుంటాము.' అంటూ వాగ్దానాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసులు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్న వెంటనే నాయకులు ఫోన్లు బేరసారాలకు దిగుతున్నారు. ఇలా రోజుల వ్యవధిలో బెయిల్ వస్తుందన్న భరోసా.. కిరాతకంగా ఓ ప్రాణం తీసినా తనపై చెయ్యి వేసేది ఎవరన్న భయంలేని తనంతోనే నేరాలు పెరుగుతున్నాయని కొందరు పోలీసు అధికారులు, లాయర్లు చెబుతున్నారు.

● నిఘా నిద్రపోతోందా!?

నగరంలో రౌడీషీటర్లకు, నేరస్థులకు, చిల్లరవేషాలు వేసే యువతకు పోలీసుల అంటే పూర్తిగా భయం పోయింది. చిన్న చిన్న కారణాలతో కక్షలు పెంచుకొని ఘాతుకాలకు పాల్పడుతున్నారు. వరుస హత్యలు, దొంగతనాలు జరుగుతున్నా పోలీస్ నిఘా ఏమైందన్న ప్రశ్న అందరిలోనూ వ్యక్తమవు తోంది. ఎప్పుడో నెలకోసారి సమీక్షలు, సమావేశాలు జరుపుతున్న పోలీస్ ఉన్నతాధికారులు రాత్రి బీట్లు, తనిఖీల నిర్వహణపై దృష్టి సారించడం లేదు. పాతనేరస్థులు, జైలు నుంచి విడుదలైన వారు, రౌడీషీటర్లు బయట ఏం చేస్తున్నారు, ఎక్కడకు వెళుతున్నారన్న దానిపై పోలీసులు నిఘా ఉంచలేక పోతున్నారు. రాత్రి పూటగస్తీలు నిర్వహిస్తున్న పోలీసులు సైరన్ వేసుకుంటూ వెళ్లిపోవడం తప్ప ఆ ప్రాంతాల్లో ఎవరు నేరాల బాటలో నడుస్తున్నారు.. ఆయా స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయా!? ఆగంతకులు ఎవరైనా వచ్చారా!? ఉన్న రౌడీషీటర్లు ఏం చేస్తున్నారు? స్థానిక గొడవలు ఏమైనా జరుగుతున్నా!? తదితర అంశాలపై అసలు దృష్టి పెట్టడం లేదు. కత్తులు, మారణాయుధాలను యువకులు వెంటబెట్టుకొని బయటకు వస్తూ నేరాలకు పాల్పడుతున్నా పోలీసులు తనిఖీల్లో ఎవరినీ పట్టుకోలేక పోవడం ఆశ్చర్యపరుస్తోంది.

టిఫిన్ కోసం హత్య

- అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి ఘాతుకం
- పాతకక్షలతో దాడి చేసి అఘాయిత్యం
- గంట వ్యవధిలో రెండు హత్యలతో కలకలం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : టిఫిన్ సెంటర్‌లో ఆర్డర్ చేసిన టిఫిన్ ముందుగా తనకే ఇవ్వాలనే విషయంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ అందులో ఒకరి హత్యకు దారితీసింది. నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అల్లాభక్షు(40) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అదేవిధంగా పాతకక్షలు మనుసులో పెట్టుకుని ఒక వ్యక్తిని కర్రలతో విచక్షణారహితంగా మోది హతమార్చారు. బుధవారం రాత్రి గంట వ్యవధిలోనే జరిగిన ఈ రెండు హత్యలు కలకలం రేపాయి. పోలీసుల సమాచారం మేరకు.... వేదాయపాళెంలోని పావని ఎస్టేట్ అపార్ట్‌మెంట్‌లో షేక్ అల్లాభక్షు, సుభహాని దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. అల్లాభక్షు బుధవారం రాత్రి అయ్యప్పగుడి సమీపంలోని ఓ టిఫిన్ సెంటర్‌కు వెళ్లి టిఫిన్ ఆర్డర్ చేశారు. అదే సమయంలో రంగనాయకులపేటకు చెందిన షేక్ ఇషాక్ అక్కడికి వచ్చాడు. పార్శిల్ చేసిన టిఫిన్ ముందుగా తనకు ఇవ్వాలని గట్టిగా మాట్లాడటంతో ఇరువురు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఇషాక్ తన వద్ద ఉన్న కత్తితో అల్లాభక్షు ఛాతిపై బలంగా పొడిచాడు. అక్కడే ఉన్న స్థానికులు అతనిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తీవ్రగాయాల పాలైన అల్లాభక్షును బావమరిది రఫి, స్థానికులు కిమ్స్ వైద్యశాలకు తరలించారు. వైదులు చికిత్స చేస్తుండగా అతను మృతిచెందాడు. అల్లాభక్షు భార్య ఫిర్యాదుతో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసులు రెడ్డి కేసు నమోదు చేశారు. నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఇన్ స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి కిమ్స్ ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించారు.

కర్రలతో విచక్షణారహితంగా మోది...

నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో షేక్ సుల్తాన్(38), షమీమ దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు సంతానం. సుల్తాన్‌పై గతంలో హత్యాయత్నం కేసు ఉంది. ఆయన బుధవారం రాత్రి పెన్నానదిలో బహిర్భూమికి వెళ్లారు. అప్పటికే అక్కడ మైపాడుగేటు రాజీవ్ గాంధీకాలనీకి చెందిన పెయింటర్ నాగరాజు, జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన షేక్ ఖలీమ్ మద్యం సేవిస్తున్నారు. వారికి సుల్తాన్‌తో పాతకక్షలున్నాయి. ఈ నేపథ్యంలో అతనితో గొడవకు దిగారు. మాటామాటా పెరగడంతో కర్రలతో విచక్షణా రహితంగా సుల్తాన్‌పై దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితులు నవాబుపేట పోలీసు స్టేషన్‌లో లొంగిపో యినట్లు సమాచారం. సుల్తాన్ తల్లి కరిమున్నీసా ఫిర్యాదు మేరకు నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డిగ్రీ పరీక్షలకు 378 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 378 మంది గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణా ధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 5848 మంది విద్యార్థులకుగాను 5470 మంది హాజరయ్యారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9124
వెండి కిలో ధర	రూ. 97,700
వెండి ఒక గ్రాము	రూ.100.70

30 నుంచి వీఎస్‌యూలో సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

● ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు కోసం టెండర్ల ఆహ్వానం

వెంకటాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి): స్థానిక విక్రమ సింహపురి యూని వర్సిటీలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు అన్ని రాష్ట్రాల నుంచి యూనివర్సిటీలు పాల్గొం టాయన్నారు. ఇందుకుగాను క్రీడాకారులకు అల్పాహారం, భోజనాలకు సంబంధించి ఉత్తర, దక్షిణాది వంటకాలను ఫుడ్ స్టాల్స్ ద్వారా అందించాలని, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాపూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని రాపూరు మండల ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సౌజన్య తెలిపారు. గురువారం రాపూరు మండలంలో రావిగుంటపల్లి, బొజ్జనపల్లి, వీరాయపాళెం, పులిగిలపాడు గ్రామాలలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగినులు మంజుల, విజయ, అంకమ్మ, భాగ్యమ్మ, టీచర్స్ ఆయాలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కొడవలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నార్తురాజుపాలెంలో ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని టీడీపీ ఎస్సీ యువనేత బండి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నార్తురాజుపాలెంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లా డారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలు గుర్తించామన్నారు. నూతన పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలు కావాలని కోరుతూ పలు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకుపో యామన్నారు. ఆమె వెంటనే ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువెళ్లారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అర్బన్‌లో బీజేపీని బలోపేతం చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అర్బన్‌లో బీజేపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సీ. వంశీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం బుచ్చిలోని బీజేపీ కార్యాల యంలో అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాసా శ్రీనివాసులు, నాగవేణి ఖాదర్‌భాష, ఖాసిం, నరసింహులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశా లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న నిర్వాహకుడు ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉందన్నారు. జిల్లావాసులకు మాత్రమే ప్రవేశముం టుందని తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి 6నుంచి 8 ఏళ్లలోపువారు అర్హులని తెలిపారు. బదిలీ సర్టిఫికెట్‌పై అన్ని తరగతులకు ప్రవేశం ఉందన్నారు. వినికిడి లోపంపై సదరం సర్టిఫికెట్, బదిలీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు కార్డు జిరాక్స్ కాపీలతో పాఠశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

యంత్రకాయమిట్ట కాలువ సర్వే

విడవలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాదెలదిన్నెలో వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనుచరులు యంత్రకాయమిట్ట కాలువను ఆక్రమించు కుని ధాన్యం బస్తాలు వేశారని స్థానిక టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ డీఈ పెంచల య్య, తహసీల్దారు చంద్రశేఖర్ బుధవారం కాలువను పరిశీలించారు. జిల్లాధికారులు ఆదేశాల మేరకు తహసీల్దారు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఆర్ఐ అబ్దుల్ సలాం, వీఆర్వో నిఖిల్, విలేజ్ సర్వేయర్ సురేంద్ర కాలువను సర్వే చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెండురోజుల్లో కాలువ సర్వేని పూర్తి చేస్తామని, అనంతరం కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తామన్నారు.





కట్టుబడిపాళెం వద్ద కంకర తేలి దుమ్ము రేగుతున్న బుచ్చి-చెన్నూరు రోడ్డు

ముళ్లపొదలు, గుంతలతో రేబాల- నాగమాం బాపురం రహదారి

దుస్థితిలో గ్రామీణ రహదారులు

- నరకమార్గంగా బుచ్చి- చెన్నూరు రోడ్డు
- బెంబేలెత్తుతున్న వాహనచోదకులు, ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రధానంగా బుచ్చి నుంచి దగదర్తి వరకు సుమారు రూ.40కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, అక్కడక్కడా కల్వర్టులు నిర్మించేలా గత వైసీపీ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ బుచ్చి-చెన్నూరు మార్గంలో రోడ్డు నిర్మాణం పేరుతో బుచ్చి మలిదేవి కాలువ దగ్గర్నుంచి రెడ్డిపాళెం వరకు ఉన్న రోడ్డును కూడా తవ్వేసి చేతులు దులుపుకు న్నారు. దీంతో నిత్యం ఆ మార్గంలో ప్రయాణా లు సాగించే వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై తేలిన కంకరపొడి గాలికి దుమ్మురేగుతూ ప్రయాణి కులను ప్రమాదాల బారిన పడేస్తోంది. ఈ రోడ్డు దుస్థితిపై ఆ వార్డు కౌన్సిలర్ భర్త నాగరాజు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

● మూణ్ణాళ్ల ముచ్చటగా గ్రామీణ రోడ్లు

మండలంలోని పెనుబల్లి-కాళయకాగొల్లు తారురోడ్డు మూణ్ణాళ్ల ముచ్చటగా తయా రైంది. పలు చోట్ల ఈ రోడ్డు పెద్ద గోతులతో దర్శనమిస్తున్నది. రేబాల నుంచి నాగ మాంబాపురం వెళ్లే మార్గం ముళ్లపొదలు, పెద్ద గోతులతో దర్శనమిస్తున్నా, పట్టించు కున్న అధికారులు, ప్రజాప్రతినిధులు కరువయ్యారు. బుచ్చి నుంచి, సాల్మానుపురం, పంచేడుకి, మినగల్లుకు వెళ్లే మార్గాలు దుస్థితిలో ఉన్నాయి. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవతో ఈ రోడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఈ రోడ్ల దుస్థితిపై ఆర్‌అండ్‌బీ జేఈ నాగరాజును వివరణ కోరగా బిల్లులు రాక బుచ్చి చెన్నూరు మార్గంలో రోడ్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలే దన్నారు. పెనుబల్లి కాగులపాడు మధ్య త్వరలో ప్యాంచింగ్ వర్క్‌లు చేపడతామన్నారు.

కట్టుబడిపాళెం రోడ్డు నిర్మించాలి



మూడేళ్లుగా ఉన్న రోడ్డు తీసేయడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. 3నెలల క్రితం కాంట్రాక్టర్ కంకర, కంకర పొడి రోడ్డుపై పరిచేసి చేతులు దులుపుకున్నాడు. అప్పటి నుంచి కట్టుబడిపాళెం నుంచి బుచ్చి పెద్దూరు వరకు ప్ర యాణం నరకంలా ఉంది. త్వరలో రోడ్డు నిర్మించి ప్రమా దాలు తొలగించాలి.

- నారాయణ, రైతు, కట్టుబడిపాళెం

దుమ్ముతో ఇళ్లలో కాపురాలు చేయలేని పరిస్థితి



మూడేళ్లుగా రోడ్డు లేక పెద్ద గోతులు, వర్షాలొస్తే కనీ సం నడవలేని పరిస్థితి. మూడు నెలల క్రితం రోడ్డుమీద కంకర తోలి వదిలేశారు. అప్పటి నుంచి దుమ్మురేగుతూ ఇళ్లలోకి చేరుతోంది. దీంతో కాపురాలు చేయలేక, కనీసం అన్నం తినే పరిస్థితి కూడా లేదు.

-హసీనా, కట్టుబడిపాళెం

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాపూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాపూరు డిపో ఎన్ఎంయుఏ కార్య దర్శి ఏవి రమణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం రాపూరు డిపోలో ప్లకార్డులతో నిరసన ర్యాలీ, గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోనల్ కార్యదర్శి కె లక్సన్ పాల్గొన్నారు. 1-2019 సర్క్యులర్, నాలుగు సంవత్సరాల నుంచి ఆగిపోయిన ప్రొమోషన్స్, పాత వైద్య విధానం అమలు చేయాలని, సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్యారేజి సెక్రటరీ కె సుధాకర్, టి భాస్కర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ సుబ్బయ్య, సిసిఎస్ డెలిగేట్ ఎస్కె నిస్సార్ అహ్మద్, గ్యారేజి ప్రెసిడెంట్ వి హరిబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టెన్ వన్ అడంగల్‌లో పట్టాదారుల పేర్లు నమోదు చేయాలి

● సీపీఎం ధర్నా

ముత్తుకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టెన్ వన్ అడంగల్‌లో పట్టాదారుల పేర్లు నమోదు చేయాలని స్థానిక తహసీల్దారు కా ర్యాలయం ఎదుట సీపీఎం ముత్తుకూరు మం డల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య మాట్లాడుతూ ఆముదాలపాడు రెవెన్యూలోని సీతారెడ్డితోపు గ్రామ ప్రజలు గత 50 సంవత్సరాలుగా 84 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నార న్నారు. ఇటీవల జరిగిన రీసర్వేలో భాగంగా పట్టాలు మంజూరు చేశారే తప్ప ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయలేదన్నారు. వెంటనే టెన్ వన్ అడంగల్‌లో పట్టాదారుల పేర్లు నమో దుచేసి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాధయ్య, నాయకులు నెల్లూరు సుధాకర్, ఇమామ్ సాహెబ్, నెల్లూరు వెంకటేశ్వర్లు, సుభాన్‌బాషా, ప్రసాద్, తదిత రులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీతోపాటు మండలంలోని గ్రామాల్లోని పలువురు వైసీపీ నాయకుల కుటుంబాలను గురువారం మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శిం చారు. రేబాలలోని వల్లూరు అశోక్‌రెడ్డికి మా తృవియోగం చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పం చేడుకి చెందిన సూరా ప్రసాద్‌రెడ్డికి మాతృ వియోగం కావడంతో బుచ్చిలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆయన తల్లి సూరా సుగుణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గోవుల మృతిపై దుష్ప్రచారం తగదు

కోవూరు, ఏప్రిల్17, (ఆంధ్రజ్యోతి) : తిరు మల గోశాలలో గోవులు మృతి చెందాయని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దుష్ప్రచారం చేయడం తగదని టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. టీడీపీ కార్యాల యంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గోశాలలో అక్రమాలెన్నో జరిగాయని చెప్పారు. అప్పట్లో రెండు పర్యాయాలు అగ్నిప్రమా దాలు జరిగాయన్నారు. అసత్య ప్రచారాలతో ప్రజల మధ్య విద్వేషాల్ని రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తుండటం భూమనకు తగదన్నారు.

సమాన అవకాశాలు కల్పించిన చంద్రబాబు



మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు దయాకర్

కోవూరు, ఏప్రిల్16, (ఆంధ్ర జ్యోతి) : సీఎం చంద్రబాబు షెడ్యూల్ కులాలకు సమాన అవకాశాలు కల్పించి, నిరుద్యోగ దళితులకు ఎంతో సహాయం చేశారని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పసుమర్తి దయాకర్ అన్నారు. స్థానిక కేవీఎస్ కల్యాణమండపంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ ఉపకులాలకు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో సమాన అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. జిల్లా యూనిట్‌గా జనాభా దామాషా పద్ధతిన ఎస్సీ వర్గీకరణ చేపట్టడటం కూటమి ప్రభుత్వ నిర్ణయం సంతోషదాయకమని చెప్పారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు మహేష్, మురళి, తిరుపాలు, సుబ్రహ్మణ్యం మాట్లాడారు.

రాములోరి తిరునాళ్లలో రంగులరాట్నం రగడ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దూరులోని కోదండ రాముడి తిరు నాళ్లలో ఏర్పాటు చేసిన రంగులరాట్నం నిర్వహణలో నిర్వాహకులు, కాంట్రాక్టర్‌కు మధ్య రగడ తార స్థాయికి చేరింది. ఈ క్రమంలో వారి మధ్య పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. తిరునాళ్లలో 10 రోజుల పాటు రంగు లరాట్నం నిర్వహణకు టెండరుదారుడు, నిర్వహణదారులకు మధ్య ఒప్పం దం ఉంది. మహారాష్ట్రకు చెందిన నిర్వహణదారులు శ్రీరామనవమి నుంచి రంగులరాట్నం నిర్వ హించేలా ఒప్పందం చేసుకుని ఆరోజు నిర్వహించలేదు. దీంతో ఆరోజు రాబడి కొరవడింది. ఈ విషయంపై కాంట్రాక్టర్‌ను కొంత తగ్గింపు కోరడంతో ఇరువురి మధ్య వివాదం ఏర్పడింది. బాధితుడు పలువురికి చెప్పినా ఒప్పందం మేరకు సర్దు బాటు చేసుకుని మిగతా తీసుకోవాలని చెప్పారు. ససే మిరా అంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు చేరింది రూ.1.90 లక్షల చెల్లింపుతో సమస్య పరిష్కారమైందని కాంట్రాక్టర్ తెలిపారు.

యువతతోనే దేశాభివృద్ధి

● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



స్పోర్ట్స్‌డే, టెక్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సింగర్ సునీత

కొడవలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి): యువతతోనే దేశాభి వృద్ధి సాధ్య మని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో నార్తురాజు పాలెంలో గల శ్రీవెంకటే శ్వర ఇంజనీరింగ్ కళాశా లలో రెండు రోజులుగా జరుగుతున్న స్పోర్ట్స్ డే, టెక్ ఫెస్ట్‌లో గురువారం సింగర్ సునీతతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటియువత సోషల్ మీడియా ప్రభావంతో పెడదోవపడు తున్నదన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని, అప్పుడే విజయం సాధించగలరని తెలిపారు. అనంతరం సింగర్ సునీత ఆటపాటలతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ గుణశేఖర్, టీడీపీ నాయకుల కేతు వెంకటరమణారెడ్డి, మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జొన్న శివకుమార్, గరికపాటి రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

విడవలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంపూరులో 10ఎకరాల గడ్డివామికి నిప్పంటుకుని సుమారు రూ. 30వేలు నష్టపోయిన బాధితుడు పసల శంకరయ్యకి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం రూ. 10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ నగదును మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దూది విజయరాఘవన్, పూండ్ల ఏసోబు, ఇమాంబాష, న్యాయవాది స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

● పారిశుధ్య కార్మికులకు..

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): రాఘవరెడ్డికాలనీ వద్ద హైవేపై ఇటీవల జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి, నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికుల కుటుంబ సభ్యు లకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు నగదును ఆసుపత్రిలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, వైస్ చైర్మన్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్‌ఖాన్, టంగుటూరు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కార్మికుల కుటుంబాలకు అందజేశారు.

నిరుపయోగంగా కియోస్క్ యంత్రం

● రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం



నిరుపయోగంగా కియోస్క్ యంత్రం

కొడవలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి): గత వైసీపీ పాలనలో రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం అయిందన డానికి ఈ కియోస్క్ యంత్రాలు నిద ర్శనం. రైతుల సంక్షేమం కోసం సాంకేతిక పరిజ్ఞానం అందించాలంటూ హడా వుడిగా వీటిని ఏర్పాటు చేసిందేతప్ప వినియోగంలోకి తెచ్చిందిలేదు. ప్రధా నంగా రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు ఏర్పాటుకు రూ.లక్షలు ఖర్చు చేశారు. సుమారు ఒక్కో యంత్రం రూ.70 నుంచి రూ.80వేలు వెచ్చించి కొనుగోలు చేశారు. రాయితీపై ఎరువులు, పురుగు మందులు విత్తనాలు కొను గోలుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. వీటికి అంతర్జాల సదుపాయం కల్పించక పోవడం, ఆ సదుపాయాలు ఉన్న ప్రాంతా ల్లో ఈ పరికరాలు పనిచేయకపోవ డంతో ఈ కేంద్రాల్లోని సిబ్బంది కొంతకాలంపాటు చరవాణిల ద్వారా వినియో గించారు. దీంతో క్రమేణా ఇవి మూలకు చేరాయి. వ్యవసాయ శాఖకు సంబంధించి యాప్‌లు ఫోన్‌లో రావడంతో ఈ యంత్రాలను సరిగా వినియోగించడంలేదు. మండలంలో 16 రైతు సేవా కేంద్రాల్లో ఈ యంత్రాలను ఏర్పాటు చేశారు. వీటి వినియోగం సరిగా లేకపోవడంతో సుమారు రూ.10లక్షలు వరకు ప్రజాధనం వృథా అయింది.

CRIME NEWS



బీరువా తాళం పగలగొట్టి చిందర వందరగా వేసిన దుస్తులు

పట్టపగలే నాలుగిళ్లలో చోరీలు

- 45 సవర్ల బంగారం, 650 గ్రాముల వెండి, రూ. 1.30లక్షల నగదు అపహరణ
- కావలి వాసులను హడలెత్తించిన దొంగతనాలు
- గంటల వ్యవధిలో ఓ దొంగను పట్టుకున్న పోలీసులు
- మరో ఇద్దరి పరార్



సీసీ ఫుటేజ్‌లో దొరికిన దొంగలు వాడిన కారు

కావలి రూరల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం పట్టపగలే తాళం వేసి ఉన్న నాలుగిళ్లలో వరుస చోరీలు జరిగాయి. దీంతో పట్టణవాసులు హడలిపో యారు. అప్రమత్తమైన పోలీసులు గంటల వ్యవధిలోనే ఓ దొంగను పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు దొంగలు పరార య్యారు. పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని వెంగళరావునగర్ రామాలయం సమీపంలో ఉంటున్న నూరు మాలకొండారెడ్డి-లలితమ్మ దంపతులు ఉదయం 11.30 గంటలకు ఇంటికి తాళం వేసి, సమీపంలోని బ్యాంకు లో ఏటీఎం కార్డు తీసుకుని మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంటికి చేరారు. ఇంటిగ్రిల్స్‌కు ఉన్న తాళం పగలగొట్టి దొంగలు లోనికి ప్రవేశించి బీరువాలోని సుమారు 35 సవర్ల బంగారు ఆభరణాలతోపాటు రూ. 40,000 నగదు దొంగిలించుకుపోయారు. అలాగే అదేప్రాంతానికి చెందిన గూడల ప్రతాప్‌కుమార్ జలదంకి మండలం టెంకంవారిపాలెంలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఆయన భార్య ఇంద్రసేన అదే మండలం గట్టుపల్లిలో ఉపాధ్యాయురాలు. ఒంటిపూటబడి కావటంతో ఉదయం 7.30 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లినవారు మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి ఇంటికి వచ్చారు. గ్రిల్స్ తాళంతో పాటు ఇంటి ప్రధానద్వారం తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు బీరువాలోని 650 గ్రాముల వెండి, సవర బంగారం దొంగిలించుకు పోయినట్లు గుర్తించారు.

అలాగే జనతాపేట నార్తులో ఉంటున్న రామకూరి శోభన్‌బాబు ఒంగోలులో పోస్టుమాస్టర్ కాగా, ఆయన భార్య లక్ష్మీప్రసన్నరాణి లింగసముద్రం మండలం పెద్దపవనిలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఉదయం ఇంటికి తాళం వేసి వారు విధులకు వెళ్లగా మధ్యాహ్నం ఇంటికి వచ్చిన లక్ష్మీప్రసన్నరాణి ఇంటి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు బీరువాలోని 9 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు రూ. 88,000 నగదు అపహరించుకు వెళ్లినట్లు గుర్తించారు. అలాగే పట్టణం లోని ఇందిరానగర్‌లో ఉంటున్న మరో ఉపాధ్యాయురాలు అరుణ ఇంటి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు రూ. 2000 నగదుతో ఉడాయించారు. వరుస చోరీల విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీధర్, రెండో పట్టణ సీఐ గిరిబాబు, ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ ప్రభాకర్ బాధితుల నుంచి వివరాలు స్వీకరించారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు. దొంగలు కారులో వచ్చి చోరీలకు పాల్పడినట్లు సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించిన పోలీసులు అప్రమత్తం అయ్యారు.

● పలుజిల్లాల్లో చోరీలు



చోరీ జరిగిన ప్రాంతంలో డీఎస్పీ, సీఐ

ఇటీవల ఇదే ముఠా తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలో సుమారు 25 వరుస చోరీలకు పాల్పడినట్లు పోలీసు విచారణలో తేలింది. ఆరు రోజుల క్రితం ప్రకాశం జిల్లా పొదిలిలో ఇదేవిధంగా వరుస దొంగతనాలు జరగటంతో అప్రమత్తమైన పొదిలి పోలీసులు టెక్నాలజీ ఆధారంగా కడప జిల్లా మైదుకూరు లో దొంగలు వినియోగించిన కారును గుర్తించారు. పోలీసు జీపును రోడ్డుకు అడ్డుపెట్టగా దాన్ని ఢీ కొట్టి దొంగలు కారును అక్కడే వదిలి పారిపోయేందుకు ప్రయత్నిం చారు. పారిపోతున్న వారిని పోలీసులు వెంబడించగా ఇద్దరు దొంగలు పరారయ్యారు. ఒక దొంగను స్థానికుల సాయం తో పోలీసులు పట్టుకున్నారు. కావలిలో చోరీకి గురైన సొత్తును రెండవ పట్టణ సీఐ గిరిబాబు గుర్తించగా సొత్తు మైదుకూరు పోలీసుల స్వాధీనంలో ఉంది.

రోడ్డుప్రమాదంలో డప్పు కళాకారుడి మృతి

మర్రిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డప్పు కళాకారుడు మృతిచెందిన సంఘటన మండలంలోని బాట గ్రామ సమీపంలో 567వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రాము లవారి తిరుణాల సందర్భంగా డప్పు కళాకారుడు నల్లిపోగు చిన్నయ్య (58) తమ స్వగ్రామం బాట టీసీ కాలనీలో బుధవారం రాత్రి దేవుని ఊరేగింపులో డప్పు వాయించి తిరిగి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా బద్వేల్ నుంచి దుత్తలూరు వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో చిన్నయ్య అక్క డికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని కృష్ణాపురం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. మర్రి పాడు ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పంచ నామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సోలార్ ప్యానల్ స్టార్టర్ల చోరీ

ఉదయగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీ వరాజుపల్లి గ్రామంలోని నరసింహారాజు, ఆంజనేయరాజులకు చెందిన పొలాల్లో ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్ స్టార్టర్లను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 420

సచివాలయంలో రాసలీలలు

- ఓ ఆర్‌ఐ, మహిళ అడ్మిన్ బాగోతం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

నెల్లూరు (సిటీ), ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో సచివాలయాలు ప్రజాసేవకే కాదు.. ఉద్యోగుల రాసలీలకు వేదికగా మారుతున్నాయి. మినీబైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఓ సచివాలయంలో ఓ ఆర్‌ఐ, మహిళా రాసలీలలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్ణీత సమయానికంటే ముందుగా సచివాలయానికి చేరుకుంటున్న వీరిద్దరు రాసలీలలో మునిగితేలుతున్నా రంటూ కార్పొరేషన్ కార్యాలయంలో గుస గుసలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి వ్యవహా రంపై సదరు సచివాలయ సమీప వ్యక్తులు అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. గత నెల చివరి తేదీలలో కొందరు వ్యక్తులు వీరిని మందలించినట్లు తెలుస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై ఎస్‌ఎంసీ ఉన్నతాధికారులు రహస్యంగా విచారిస్తున్నట్టు సమాచారం.

న్యూస్ బాక్స్

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు నమోదు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (పీఎంఐఎస్) ను జిల్లాలోని యువత సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. యువత నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని, గడువును ఈనెల 22 వరకు పెంచారని తెలిపారు. పదో తరగతి, దానికి సమానమైన విద్యార్హత, 21 నుంచి 24 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి దేశంలోని అత్యుత్తమ 500 కంపెనీల్లో 12నెలలు ఇంటర్న్‌షిప్ చేసే అద్భుత అవకాశం లభిస్తుందని తెలిపారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ప్రతీ నెలా రూ.5 వేలు స్టైఫండ్, పథకం ప్రారంభంలో ఒకేసారి రూ.6 వేలు ప్రత్యేక ప్రోత్సాహక నిధి కూడా అందిస్తారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 1126 మంది నమోదు చేసుకున్నారని, ఆసక్తి గల వారు త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారితో కలెక్టర్, జేసీ భేటీ

నెల్లూరు (లీగల్) ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన జీ శ్రీనివాస్‌ను కలెక్టర్ ఓ ఆనంద్, జాయింట్ కలెక్టర్ ఏ కార్తీక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఒకటవ అదనపు జిల్లా జడ్జిగా గీత

నెల్లూరు 1వ అదనపు జిల్లా జడ్జిగా ప్రస్తుతం జిల్లా 8వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జీ గీతను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 3వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న ఎంఏ సోమశేఖర్‌ను నియమించింది.

న్యాయవాద గుమాస్తాల సంఘం కార్యవర్గం ఎంపిక

నెల్లూరు నగర న్యాయవాదుల గుమాస్తాల సంఘం ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఉజిని అంజనేయులు, సెక్రటరీగా జీ నాగేశ్వర్‌రావు, ట్రెజరర్‌గా టీ సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

నూతన కమిషనర్ ఎవరో?

- ఇన్‌చార్జినీ నియమించలేదు!

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థకు నూతన కమిషనర్‌గా ఎవరు వస్తారన్నది అధికార, రాజకీయ వర్గాల్లో ఉత్కంఠగా మారింది. కమిషనర్‌గా ఉన్న సూర్యతేజను బుధవారం బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. ఈ విషయంలో గురువారం స్పష్టత వస్తుందని అన్నీ వర్గాలు ఆశించాయి. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు వెలువడకపోవడం గమనార్హం. ఇన్‌చార్జిగానూ ఎవరికీ బాధ్యతలు అప్పగించకపోవడం చర్చనీయాంశమైంది.

'మాకు రక్షణ కల్పించండి'

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తాము ఇష్టపడి ప్రేమ వివాహం చేసుకున్నామని, కులాలు వేరు కావడంతో పెద్దలు అంగీకరించడం లేదని, తమకు రక్షణ కల్పించాలని బుచ్చి మండలం రెడ్డిపాళేనికి చెందిన పంట కాత్యాయినీ, దగదర్తి మండలం తిరివీధిపాడు కు చెందిన పుట్ట పురుషోత్తం అధికారులను కోరారు. వారు గురువారం జర్నలిస్ట్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13న ప్రేమ వివాహం చేసుకున్నామని తెలిపారు. తనకు తన భర్తకు కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని కాత్యాయినీ పేర్కొన్నారు. ఈ విషయాన్ని నెల్లూరు రూరల్ డీఎస్పీ, బుచ్చిరెడ్డిపాలెం సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు తెలిపామన్నారు. తమకు రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగోన్నతుల్లో మెరిట్ కమ్ రోస్టర్‌ను అమలు చేయాలి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల్లో మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని బీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు కొనసాగిస్తున్న మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్నే కొనసాగిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లు ఎత్తివేసేలా మెరిట్ జాబితాలను తయారు చేస్తున్నారని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు రమణ య్య, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం సుబ్బు, ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కోదండరాముడికి పుష్పయాగం

- ముగిసిన బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉస్మాన్ సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయంలో గురువారం రాత్రి పుష్పయాగం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం మూలవర్లకు పూలంగి సేవ కనువిందు చేసింది. అనంతరం వివిధ సుగంధ పుష్పాలతో సీతారాములను అర్చించారు. ఆ తర్వాత ఏకాంత సేవతో ఉత్సవాలు ముగిశాయి. నగర ప్రముఖులు పత్తి జయరామయ్య నాయుడు, మోదం మల్లికార్జునరావు, ఈవో దర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.



మూలస్థానేశ్వరుడి హుండీ ఆదాయం రూ.8లక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీల లెక్కింపు జరిగింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి గురువారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.8,02,323 వచ్చింది. అలాగే 7.700 గ్రాముల బంగారం, 139 మిల్లీగ్రాములు వెండి హుండీ ద్వారా లభించాయి. ఈ మొత్తాన్ని ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. హుండీల లెక్కింపునకు పర్యవేక్షకులుగా వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో గోపి వ్యవహరించారు. మూలస్థానేశ్వర ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాలుడికి ఏకాంతసేవ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఏకాంత సేవ జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, సాయంత్రం పూలంగిసేవ జరిగాయి. ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ధర్మకర్తలు, ఈవో, సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కార్పొరేషన్‌లో ఎలక్ట్రికల్ వ్యర్థాల సేకరణ కేంద్రం

- రేపు ప్రారంభం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో పోగయ్యే ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వీర్యం చేసేందుకు నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నెల్లూరు విభాగం అధికారి అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇళ్లు, దుకాణాలు, విద్యా సంస్థలు, ఆఫీసులు, ఇతర ప్రదేశాల్లోని ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలైన టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్, లాప్‌ట్యాప్, చార్జర్, సెల్‌ఫోన్, ప్రింటర్, కూలర్, వాటర్ హీటర్, బల్బులు, స్కానర్లు తదితర వస్తువులను ఈ నూతన కేంద్రానికి తీసుకువస్తే అక్కడ బరువును బట్టి బహుమతులు అందచేస్తామని తెలిపారు. ఈ కేంద్రాన్ని తమ శాఖ, ఎస్‌ఎంసీ సంయుక్తంగా నిర్వహిస్తాయన్నారు. ప్రజలు సహకరించి కాలుష్య రహిత నెల్లూరుకు చేయూతనివ్వాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా 'పోషణ్ పక్వాడ'


నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, నెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లావ్యాప్తంగా పోషణ్ పక్వాడ కార్యక్రమాలు జరిగాయి. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు, ఇందిరమ్మకాలనీలో గల అంగన్‌వాడీ సెంటర్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో కే లక్ష్మీదేవి మాట్లా డుతూ శిశువు జీవితంలోని మొదటి వెయ్యి రోజుల పౌష్టికాహారం ప్రాము ఖ్యతను, పోషణ్ పక్వాడ ఉపయోగాన్ని తెలియజేశారు. పౌష్టికాహార ప్రదర్శన, గర్భవతులకు సీమంతాలు, పౌష్టికాహార కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర ప్రచార సహాయకుడు పీ హరికృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.



చిన్నారులతో సీడీపీవో లక్ష్మీదేవి, అంగన్‌వాడీ సిబ్బంది

మెగా డీఎస్సీకి సమయం ఆసన్నం

- నోటిఫికేషన్ ప్రక్రియ వేగవంతం
- వారంలో ప్రకటనకు అవకాశం?
- జిల్లాలో 645 పోస్టులు
- ఆశావహుల ఎదురు చూపు



నెల్లూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారి నిరీక్షణ ఫలించనుంది. వారంలోపు ఎప్పుడైనా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పాఠశాల విద్యా శాఖ వేగవంతంగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. పోస్టుల వివరాలు, సబ్జెక్ట్‌ల వారీగా ఖాళీలు తదితర అంశాలపై యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఎస్సీ వర్గీకరణపై స్పష్టత వచ్చిన వెంటనే ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని తెలిసింది.

తుది కసరత్తు

గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఉపాధ్యాయ పోస్టుల భర్తీని పూర్తిగా విస్మ రించడంతో నాటి నుంచి నిరుద్యోగులకు ఎదురు చూపులే మిగిలాయి. ఈ క్రమంలో గతేడాది ఎన్నికల ప్రచారంలో కూటమి పార్టీలు మెగా డీఎస్సీ హామీ ఇచ్చాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని అందరూ భావించి నప్పటికీ పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. అన్ని అడ్డంకులను తొలగించుకుని కోర్టు కేసులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే క్రమంలో ఆలస్యమైందని ప్రభుత్వం తెలిపింది. తాజాగా మెగా డీఎస్సీ ప్రకటన దిశగా ప్రక్రియన వేగవంతం చేయడంతో అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను నిర్వహించి ఫలితాలను కూడా ప్రకటించడంతో డీఎస్సీ కోసం జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 16,347 టీచర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. జిల్లాలో 645 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించిన విషయం విదితమే. అయితే స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన సబ్జెక్ట్‌ల వివరాలు, ఎస్జీటీలు, పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపాల్... ఇలా మొత్తం ఖాళీల్లో స్వల్ప మార్పులు ఉండనున్నాయని, వీటిపై మరో రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని సమాచారం. జూన్ నాటికి పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో టెట్‌లో అర్హత సాధించిన వారంతా ముమ్మర సాధనలో నిమగ్నమయ్యారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అందించే పద్మ అవార్డులకు సంబం ధించి 2026వ సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన క్రీడాకారులు www.padmaa wards. gov.in పోర్టల్‌లో పొందుపరిచిన మార్గదర్శ కాలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవా లని కోరారు. పూర్తిచేసిన దరఖాస్తులను వర్డ్, పీడీఎఫ్ రూపంలో sportsinap@ gmail.comకుగానీ, incentives. sche mes @gmail.comకుగానీ మే 26వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు పంపించాలన్నా రు. మరిన్ని వివరాలకు నెల్లూరు లోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉన్న డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

- నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాలేషా

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. ఈ మేరకు గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తీరుతో దివ్యాంగుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ట్రై సైకిళ్ల తయారీ కర్మాగారాన్ని నెల్లూరులో పునః ప్రారంభించాలని కోరారు. దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా ఇచ్చే రుణాలకు సంబంధించి జిల్లాలో పలు అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జాతీయ నాయకురాలు కూనపరెడ్డి అరుణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సోమిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలేషా, అరుణ తదితరులు

ఏసీఎస్ఆర్‌పై 'నారాయణ' జట్టు విజయం

హోరా హోరీగా క్రికెట్ టోర్నీ

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణ వైద్య కళాశాల మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు గురువారం రెండో రోజు హోరా హోరీగా సాగాయి. తిరుపతి బాలాజీ వైద్య కళాశాల, విశాఖపట్నం ఆంధ్ర వైద్య కళాశాల జట్లు తలపడగా ఆంధ్ర వైద్య కళాశాల విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కడప ప్రభుత్వ డెంటల్ కళాశాలతో కడప జీఎంజీ వైద్య కళాశాల పోటీపడగా జీఎంజీ వైద్య కళాశాల గెలుపొందింది. అలాగే నారాయణ వైద్య కళాశాలతో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి వైద్య కళాశాల పోటీ పడగా నారాయణ వైద్య కళాశాల జట్టు విజయం సాధించింది. చిత్తూరు అపోలో వైద్య కళాశాలతో వైజాగ్ ఎంఐ వైద్య కళాశాల పోటీ పడగా వైజాగ్ జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు ఎన్ఆర్ఐ వైద్య కళాశాలతో విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాల పోటీపడగా ఎన్ఆర్ఐ కళాశాల గెలుపొందింది. కస్తూరి వైద్య కళాశాలతో ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల పోటీపడగా ఒంగోలు ప్రభుత్వం వైద్య కళాశాల జట్టు జయకేతనం ఎగురవేసింది. పోలీస్ గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ పోటీలో వైజాగ్ గాయత్రి వైద్య కళాశాలతో కర్నూలు కేఎంసీ వైద్య కళాశాల పోటీపడగా కర్నూలు జట్టు గెలిచింది. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలతో జమ్స్ వైద్య కళాశాల పోటీపడగా గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల జట్టు గెలుపొందింది. అలాగే ఏసీ సుబ్బారెడ్డి గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ పోటీలో విజయవాడ ఎస్ఎంసీతో తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల పోటీపడగా ఎస్వీ వైద్య కళాశాల జట్టు విజయం సాధించింది. నంద్యాల శాంతిరామ్ వైద్య కళాశాల జట్టుతో ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాల పోటీపడగా నంద్యాల శాంతిరామ్ వైద్య కళాశాల జట్టు గెలుపొందింది.



నారాయణ వైద్య కళాశాల మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీ

మాదిగల ఆకాంక్షను నెరవేర్చారు

- టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణ

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మాదిగల మూడు దశాబ్దాల పోరాట ఆకాంక్షను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ అన్నారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి సాధ్యమని మరోసారి రుజువైందన్నారు. ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలుపటం హర్షణీయమన్నారు. గ్రూప్ 1లో 12 ఉపకులాలకు 1శాతం, గ్రూప్ 2లో 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్ 3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దీనివల్ల రోస్టర్‌లో అందరికీ న్యాయం జరుగుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి కువ్వారపు నాగేశ్వరరావ్, పాదర్తి నరసింహ, కొండా వెంకయ్య, వడ్లమూడి సుమన్, చైతన్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాతంగి కృష్ణ

రేపు శ్రీనాథ మహాకవి సాహిత్యం- జీవనంపై ప్రవచనం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీనాథ మహాకవి సాహిత్యం - జీవనం అనే అంశంపై శనివారం సాహిత్య ప్రవచనం జరగనుంది. ఈ కార్యక్రమం నగరంలోని వర్ధమాన సమాజం భవనంలో సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక నిర్వాహకులు ఎం సుబ్రహ్మణ్యం, వై శేషగిరీశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కవులు, సాహిత్య అభిమానులు హాజరుకావాలని కోరారు.

అందుబాటులోకి ఏసీ బస్‌షెల్టర్లు

- దివ్యాంగులతో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : నగరంలో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఏసీ బస్‌షెల్టర్లు తాజాగా ప్రయాణికులకు అందు బాటులోకి వచ్చాయి. ఇటీవల కొన్నింటిని మంత్రి నారాయణ ప్రారంభించ గా గురువారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అయ్యప్ప గుడి వద్ద దివ్యాంగులతో షెల్టర్‌ను ప్రారంభించారు. కరెంటాఫీసు, జీజీ హెచ్, శబరి క్షేత్రం, మద్రాస్ బస్టాండ్ వద్ద బస్‌షెల్టర్లను ఏడీసీ నందన్‌తో కలిసి టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడు తూ ప్రస్తుత వేసవి కాలంలో ఏసీ బస్‌షెల్టర్లు నగర ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఈ షెల్టర్లను వైసీపీ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేసిందని విమర్శిం చారు. ప్రజాధనం దుర్వినియోగం కానివ్వకుండా తిరిగి వినియోగంలోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



దివ్యాంగునితో కలిసి బస్‌షెల్టర్ ప్రారంభిస్తున్న కోటంరెడ్డి

భూమి సారవంతంగా ఉంటేనే అధిక దిగుబడి

- ఏడీఏ శ్రీనివాసులు


నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : పంట పొలాలు సారవంతంగా ఉంటేనే ఆశించిన దిగుబడులు అందుతాయని వ్యవసాయ శాఖ నెల్లూరు ఏడీ శ్రీనివాసులు, ఏవో నాగమోహన్ తెలిపారు. గురువారం మండలంలోని మాదరాజుగూడూరు గ్రామంలో రైతులతో కలిసి పొలాల్లోని మట్టి నమూనాలను పరిశీలించారు. పంట అయిపోయిన తరువాత వెంటనే భూమి సారాన్ని పరిశీలించుకోవాలని సూచించారు. తద్వారా పోషకాల హెచ్చుతగ్గులు చెప్పారు. అనంతరం అధికారులు సూచించిన ఎరువులు వాడితే పొలం సారవంతమై తదుపరి పంటలో ఆశించిన దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రతీ రైతు తమ పొలాల్లో మట్టి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. వాతావరణంలో మార్పుల కారణంగా అకాల వర్షాలు కురుస్తున్నాయని, బయట ధాన్యం ఆరబెట్టుకున్న రైతులు టార్పాలిన్ పట్టలు కప్పి రక్షించుకోవాలన్నారు.

అనాథాశ్రమాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన ముందస్తు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. శనివారం వేమిరెడ్డి పుట్టినరోజు సందర్భం గా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని వారి నివాసంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నాయకులు డేవిడ్‌జాన్, అతడి అనుచరులు గీతామయి వృద్ధుల ఆశ్రమం, వియానీ హోం, విశ్వభారతి అంధుల ఆశ్రమానికి రూ.50వేలు విలువైన నిత్యావసర సరుకులను ప్రశాంతిరెడ్డి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో రాజేష్‌రెడ్డి, మౌళి, శామ్యూల్, హరి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



రేపటి నుంచి ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పో





మరో రెండు రోజుల్లో ఈ నవయవ్వనుడు 75వ పుట్టిన రోజు జరుపుకోబోతున్నారు. పుట్టింది రైతు కుటుంబంలో. చదువుకున్నది ఎకనామిక్స్. వృత్తి రాజకీయం. అయినా టెక్నాలజీతో కలిసి పరుగులు తీస్తారు. నడిచేది వర్తమానంలో అయినా.. దృష్టి పాతికేళ్ల ముందుకే సారిస్తారు. ఈయన వయసును గెలిచిన రహస్యం.. బహుశా నిరంతర మేధోమథనం.

సంక్షోభాలను సానుకూలంగా మార్చుకోగల చాతుర్యం.. బడా సంస్థలను సైతం ఒప్పించి రాష్ట్రానికి రప్పించగల నైపుణ్యం.. దేశాధినేతలను సైతం మెప్పించగల మాటకారితనం.. నారావారిపల్లి గడ్డమీద పుట్టిన ఈ రైతుబిడ్డకు ఇవన్నీ ఎలా సాధ్యం..?!

కయ్యాకాలువల్లో ఈతలు.. బడికి మైళ్ల నడకలు.. ఒళ్లొంచి చేసిన పొలం పనులు.. చదువుకునే రోజుల్లోనే శ్రమదానాలతో పల్లెరోడ్లకు మెరుగులు.. బడికోసం జోలెపట్టి ఊరూరా, గడపగడపా తిరిగిన అనుభవం.. వెన్నంటి ఉండే స్నేహబృందాలు.. శీనయ్య మెస్‌లో భోజనాలు.. గురువులతో చర్చలు.. ప్రతి అడుగు నుంచీ చంద్రబాబు పాఠాలు నేర్చుకున్నారని ఆయన బాల్య స్నేహితులూ, ఆయనతో కాలేజీల్లో కలిసి చదువుకున్నవారూ, ఆయనకు చదువు చెప్పిన గురువులూ చెబుతున్నారు. విజనరీగా చంద్రబాబుకు బీజాలు చిన్ననాటి నుంచే పడ్డాయని వారు గుర్తు చేసుకుంటూ ఆంధ్రజ్యోతితో పంచుకున్న జ్ఞాపకాలు వెల్లడిస్తున్నాయి. ఏప్రిల్ 20న చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా ఆయన బంధుమిత్రుల ఇంటర్వ్యూలు ఈ రోజు నుంచీ వరుసగా అందిస్తున్నాం.

75 ఏళ్ల బాబు బాల్య సంగతులు.. 6వ పేజీలో



ఎక్స్‌పో

తిరుపతి/తిరుపతి(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19, 20వ తేదీల్లో ఎడ్యుకేషన్ ఎక్స్‌పో-2025 జరగనుంది. ఎయిర్‌బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాలులో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల దాకా కొనసాగుతుంది. దక్షిణ భారతదేశంలోని 30 ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఎక్స్‌పోలో పాల్గొంటున్నాయి. ఇంటర్మీడియట్ లేదా ప్రీ డిగ్రీ తర్వాత ఏ కోర్సుచేయాలనే సందిగ్ధంలో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ఎక్స్‌పోను సందర్శిస్తే తగిన అవగాహన కలుగుతుంది. ఆయా విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, కోర్సుల వ్యవధి, వాటి ఫీజులు తదితర వివరాలతో పాటు విదేశీ విద్యకు సంబంధించిన సమాచారం కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఎక్స్‌పోను సందర్శించడానికి, సమాచారం పొందడానికి అడ్మిషన్ల ప్రక్రియకు ఎలాంటి రుసుం లేదు. ఏకకాలంలో దక్షిణ భారతదేశంలోని ఇన్ని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఒకే వేదికపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. జిల్లాతో పాటు నగరంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఎక్స్‌పోలో పాల్గొనే సంస్థలు

అపోలో యూనివర్శిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఎడ్యుకేషనల్ ఎక్స్‌పోకు రాజ్యలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ స్పాన్సర్‌గా, ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(రామాపురం) కో స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నాయి. ఈ దిగ్గజ సంస్థలతోపాటు ఐఐటీ మద్రాసు, ఆకాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, ఆచార్య, అనురాగ్ యూనివర్శిటీ, వేల్స్, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్శిటీ, మార్వాడీ యూనివర్శిటీ, చెట్టినాడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ,సీఎంఆర్ యూనివర్శిటీ, జీఆర్టీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, కింగ్స్ కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ కాలేజ్, ఎన్ఐటీటీఈ డీమ్డ్ టుబి యూనివర్సిటీ, ఎన్ఎంఐఎంఎస్ డీమ్డ్ టుబి యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ పీస్, మెడికో అబ్రాడ్ కన్సల్టెంట్స్, ప్రెసిడెన్సీ యూనివర్సిటీ, శ్రీనివాస అకాడమీ, భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, ఆర్ అకాడమీ, అమిటీ గ్లోబల్ బిజినెస్ స్కూల్ సంస్థలు ఈ ఎడ్యుకేషనల్ ఎక్స్‌పోలో పాల్గొననున్నాయి.

తిరుపతిలో హైడ్రామా

తిరుపతిలో గురువారం ఉదయం హైడ్రామా చోటుచేసుకుంది. టీటీడీ గోశాలలో వందకుపైగా ఆవులు మృతి చెందాయన్న భూమన ఆరోపణల నేపథ్యంలో వివాదం రాజుకుంది. గోశాల సందర్శనపై సవాళ్లు.. ప్రతిసవాళ్లతో రాజకీయం వేడెక్కింది. గోశాలను కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నేతలు సందర్శించారు. గుంపుగా కాకుండా ఐదుగురు నేతలు, వారి వ్యక్తిగత భద్రతా సిబ్బంది మాత్రమే గోశాలకు రావాలని పోలీసులు సూచించినా టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి మాత్రం గుంపుగా బయలుదేరారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా చోటుచేసుకుంది.



గోశాల ప్రవేశ ద్వారం వద్ద భారీ బందోబస్తు

- టీటీడీ గోశాల చుట్టూ రాజకీయ రగడ

భారీగా మోహరించిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అటు వైసీపీ.. ఇటు కూటమి పార్టీల నేతలు తిరుపతిలోని టీటీడీ గోశాల సందర్శన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఇళ్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గోశాలలోకి కూటమి నేతలు వెళ్లి వారు బయటకు వచ్చాక.. వైసీపీ నాయకులను అనుమతిస్తామని ఎస్పీ ప్రకటించారు. దీంతో ఎక్కడా పరిస్థితి అదుపు తప్పకుండా ముందస్తుగా వారి ఇళ్ల వద్ద పోలీసులు మోహరించారు. ఎస్పీ అనుమతులు లేనిదే వారిని ఇళ్లలో నుంచి బయటకు రానీయకుండా ముందస్తు భద్రత ఏర్పాటు చేశారు. రెండు పార్టీల నేతలను వేర్వేరుగా.. శ్రేణులతో కాకుండా పరిమిత సంఖ్యలోనే అనుమతిస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు స్పష్టంచేశారు. కానీ, మందీమార్బలంతో తన ఇంటి నుంచి బయలుదేరిన భూమనను అక్కడే అడ్డుకున్నారు. ఇక, గోశాల ప్రవేశ ద్వారం వద్ద పూర్తిస్థాయిలో నిఘా పెట్టారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు భక్తవత్సలం (తిరుపతి), చెంచుబాబు (నాయుడుపేట), కొందరు సీఐలు గోశాల లోనూ కూటమి నేతల వెంటే ఉన్నారు. మధ్యాహ్నం 1.26 గంటలకు గోశాల నుంచి వీరంతా బయటకు వచ్చారు. ఇక, భూమన అభినయ్ గోశాల వద్దకు వచ్చినా లోపలకు అనుమతించలేదు. దీనిపై అతను ఆందోళనకు ఉపక్రమించే ఆలోచన ఉందని తెలుసుకున్న పోలీసులు.. అతడిని అదుపులోకి తీసుకుని ఇంటి వద్ద వదలిపెట్టారు. ఇక, గోశాల వద్దకు వచ్చిన ఎంపీ గురుమూర్తికి, కూటమి ఎమ్మెల్యేలకు మధ్య కొంతసేపు వాగ్వాదం నడిచింది. ఎస్పీ జోక్యం చేసుకుని ఎంపీని లోపలకు పంపడంతో వివాదం సద్దుమణిగింది.



తన ఇంటి ముందు రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న భూమన

వైసీపీ హంగామా

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు, నేతలతో కలిసి బయలుదేరిన తనను పోలీసులు అడ్డుకున్నారంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేలపై పడుకుని నిరసన తెలిపారు. ఉదయం 9.30 నుంచి 45 నిమిషాలకు పైగా ఈ నిరసన చేపట్టారు. గోశాల ఘటనపై ఇంత జరుగుతున్నా సనాతన ధర్మం అంటూ మాట్లాడే పవన్ ఎందుకు మాట్లాడటం లేదని మాజీ మంత్రి రోజా ఆరోపించారు. గోశాలకు వెళ్లాలనుకున్న భూమనను పోలీసులు అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఈ ఏడాది మార్చి వరకు 191 ఆవులు చనిపోయాయంటూ గోశాల మేనేజరు అధికారికంగా ప్రకటన విడుదల చేశారంటూ మీడియాకు భూమన కరుణాకరరెడ్డి చూపారు. గోశాలకు ఎప్పుడైనా రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, భూమన అభినయ్, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



గోశాలలో ఎమ్మెల్యేలు, కూటమి నేతలు

ఎమ్మెల్యేలు, కూటమి నేతల మాట

తిరుపతి ఆంధ్రజ్యోతి

ప్రశాంతంగా ఉంటే ఆయనకు నచ్చదు

తిరుపతి ప్రశాంతంగా ఉండడం ఆయనకు ఇష్టం ఉండదు. ఆయన ఆరాచకాలన్నీ ప్రజలకు తెలుసు. భూమన డ్రామా రికార్డు ఇక్కడ అరిగిపోయింది. వేరేచోటకు వెళ్లి నాటకాలు వేసుకుంటే మంచిది.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

హిందుత్వంపై దాడికి ముందుంటుంది

గతంలో పింక్ డైమెండ్.. ఇప్పుడు టీటీడీ గోశాలమీద పడ్డారు. ఇలా హిందుత్వంపై దాడికి వైసీపీ ఒంటికాలిపై లేస్తుంటుంది. గోశాలకు రాకుండా రోడ్డుపై కరుణాకర్‌రెడ్డి డ్రామాలు వేయడం సరి కాదు.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

ఆయన రాజకీయం పరిసమాప్తం

ప్రజలు, ప్రకృతి, కుల, మతాలతో నీచ రాజకీయాలు చేసిన వైసీపీ పవిత్ర గోశాలనూ వదిలిపెట్టలేదు. ఇంతటితో భూమన రాజకీయం పరిసమాప్తమైనట్లే. గోమాతకు క్షమాపణ చెబితే కొంత ప్రాయశ్చిత్తం వస్తుంది.

- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

రాజకీయ లబ్ధి కోసమే

ఏ జీవరాశికైనా జనన,మరణాలు సాధారణం. విజిలెన్స్ నివేదిక చూస్తే గోవుల మరణాలకు గత నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. రాజకీయ లబ్ధికోసమే వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోంది.

- థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

తగిన గుణపాఠం చెబుతాం

రాజకీయ హత్యలు చేసేవాళ్లు ఇప్పుడు గోమాతను హతమారుస్తున్నారు. గోవుల మరణాలపై నోటికొచ్చినట్టు చెబుతున్నారు. రాజకీయ లబ్ధికోసం గోశాలను వాడుకుంటున్న వైసీపీకి గుణపాఠం చెబుతాం.

- నరసింహ యాదవ్, చైర్మన్, యాదవకార్పొరేషన్.

ఎన్ని నాటకాలాడినా ప్రజలు నమ్మరు

ఎన్ని నాటకాలాడినా తిరుపతి ప్రజలు నమ్మరు. గోమాతను అడ్డుపెట్టుకుని భూమన రాజకీయం చేయడమేంటి? చేసిన తప్పును ఒప్పుకుని గోవులకు క్షమాపణ చెప్పాలి.

- సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే, తిరుపతి

భూమన పెద్ద డ్రామా కింగ్

పెద్ద డ్రామా కింగ్ అయిన భూమనకు నంది అవార్డులు ఇవ్వాలి. మేము మూడు గంటలున్నా గోశాలకు రాకుండా రోడ్డుపై నాటకాలాడారు. ఆయన హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు.

- బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

కమీషన్ల ఛైర్మన్ ఘనత నీదే

గోవిందుడు, గోవుతో పెట్టుకున్నావు. జరగబోవు పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. నువ్వు వస్తానంటే మేము వద్దన్నామా? ఎందుకు డ్రామాలు ఆడతావు? కమీషన్ల ఛైర్మన్‌గా టీటీడీ చరిత్రలో నిలిచిపోయావు.

- భానుప్రకాష్ రెడ్డి, సభ్యుడు, టీటీడీ

భగవంతుడితో ఆడుకుంటున్నావ్

గత ఎన్నికల్లో 63వేల ఓట్లతో ఓడిపోయిన ఫ్రస్ట్రేషన్‌లో కరుణాకరరెడ్డి భగవంతుడితో ఆటలాడుతున్నారు. వైసీపీ పాలనలో రాముడి తలనరికినా, రథం కాలిపోయినా నిందితులను ఎందుకు పట్టుకోలేదు.

- పసుపులేటి హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు, జనసేన

సౌత్ ఇండియన్ బ్యాంకుకు బాంబు బెదిరింపు



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి అన్నారావు సర్కిల్ లోని సౌత్ ఇండియన్ బ్యాంకుకు గురువారం బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. 'మీ బ్యాంకులో బాంబులు పెట్టాం...త్వరలో పేల్చేస్తున్నాం' అని ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. అప్రమత్తమైన బ్యాంకు మేనేజర్ అశోక్ వర్ధన్ అలిపిరి సీఐ రాంకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అజిత నేతృత్వంలో డాగ్, బాంబు డిస్పోజల్ టీమ్‌లు, రిజర్వు ఎస్ఐ అమరనాథరెడ్డి, సిబ్బంది కలిసి రెండు గంటల పాటు గాలించారు. బాంబుల ఆనవాళ్లు దొరక్క పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి ఫేక్ మెయిల్స్ గతంలో కొన్ని హోటళ్లకు వచ్చిన సంగతి తెలిసిందే.



ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న వీసీ ఆచార్య ఉమ

పద్మావతి వర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. రెండు రోజులుగా యూనివర్సిటీలో బోధన, పరిశోధన, విస్తరణ, పాలన తదితర అంశాలను ఐఎస్‌వో బృందం పరిశీలించింది. ఈ అంశాల్లో పద్మావతి మహిళా యూనివర్సిటీ అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తోందంటూ కితాబిచ్చింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను వీసీ ఉమకు హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ ఆలపాటి శివయ్య అందజేశారు. దీంతో పాటు గ్రీన్ జోన్ ఎమ్సెరిగేట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ ఎన్.రజని, ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ డైరెక్టర్ టి.త్రిపురసుందరి, టి.సీతాకుమారి (లా), ప్రొఫెసర్ జాన్ సుష్మా (బయోటెక్నాలజీ), పి.విజయలక్ష్మి, బీఎన్ నీలిమ (జర్నలిజం), డాక్టర్ నీరజ (ఉమెన్ స్టడీస్), పీఆర్వో డాక్టర్ శ్రీరజని తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ మాజీ చైర్మన్‌పై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్వీయూ వర్సిటీ సీఐ రామయ్య తెలిపారు. టీటీడీ గోశాలపై అసత్య ఆరోపణలు చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీశారని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకులు బుధవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ కావడంతో గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.


'స్థానిక సంస్థల' పరిపుష్టికి నిధులు పెంచండి

- 16వ ఆర్థిక సంఘానికి ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న అరవింద్ పనగారియా

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర విభజనతో నష్టపోయాం. కేంద్ర నిధులు మరింత పెంచి స్థానిక సంస్థలను ఆదుకోండి' అంటూ 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియాకు పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో గురువారం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా నేతృత్వంలో సభ్యులు అన్నే జార్జి మథ్యూ, డాక్టర్ మనోజ్ పాండా, రిత్విక్ పాండే, కేకే మిశ్రా, అమృతచ, ఆదిత్య పంత్, జ్యోతి నాగర్కోటి, అభయ్‌మీనన్ గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. కేంద్ర సహకారంతో సోలార్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయండి. తద్వారా మున్సిపాలిటీల్లో విద్యుత్ భారం తగ్గుతుంది. ఆ నిధులను మౌలిక వసతులకు వినియోగిస్తాం' అని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి కోరారు. ఏటా ఆర్థిక సంఘం ఇచ్చే నిధులు మరింత పెంచాలని సత్యవేడు జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతల్లో పెరిగిన జనాభా నిష్పత్తి ప్రకారం ఆర్థికసంఘం నిధులు పెంచితే స్థానిక సంస్థలు ఆర్థికంగా బలోపేతమవుతాయని తిరుపతి రూరల్ చెర్లోపల్లి సర్పంచ్ సుభాషిణి అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలను నిర్మించడం ద్వారా వచ్చే ఆదాయంతో పల్లెలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఎంపీపీ జ్యోత్స్న అన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు ఈసారి వచ్చే ఆర్థిక సంఘం నిధులు పెంచాలని పంచాయతీ, మున్సిపాలిటీ, నగరపాలకసంస్థ కార్యాలయాలకు సోలార్ ప్రాజెక్టులకు నిధులు మంజూరుచేయాలని స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రత్నకుమారి ఆర్థిక సంఘాన్ని కోరారు. మీ సలహాలు, సూచనలు, అభిప్రాయలను కమిషన్ పరిశీలిస్తుందని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా తెలిపారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి 33 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.



75 ఏళ్ల బాబు
దోస్తుల జ్ఞాపకాలు





చంద్రబాబు గొప్ప దార్శనికుడు అని ప్రపంచం కీర్తిస్తుంది. సంక్షోభాలను సైతం అనుకూలంగా మలచుకోగల నేర్పుగల నాయకుడు అని రాజకీయ పండితులు పొగుడుతారు. ఇంజనీరింగ్ చదువుకోలేదు కానీ టెక్నాలజీని ఔపోసన పట్టిన మేధావిగా అందరూ గుర్తిస్తారు. అభివృద్ధికి దారులు వెతకడానికి తపనపడే నారా చంద్రబాబు నాయుడిలో ఈ లక్షణాలన్నీ చిన్ననాటి నుంచే ఉన్నాయి. నారావారిపల్లిలో మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు.. వెనుకబాటుతనంపై సీఎంగా చేస్తున్న పోరాటానికి బీజాలు బాల్యంలోనే ఉన్నాయని ఆయన చిన్ననాటి నేస్తాల మాటల్లో వెల్లడవుతోంది.. ఈ 75 ఏళ్ల నిత్య ఉత్సాహి బాల్య జ్ఞాపకాలను ఆంధ్రజ్యోతితో వారు పంచుకున్నారు.

ఇంటర్వ్యూలు
ఆంధ్రజ్యోతి బ్యూరో
తిరుపతి

భూములు, బావులున్నోడే!



చంద్రబాబు తండ్రి ఖర్జూరనాయుడుకు రెండెకరాల భూమి మాత్రమే వుండేదని, అలాంటిది చంద్రబాబుకు ఇంత ఆస్తి ఎలా వచ్చిందని రాజకీయ ప్రత్యర్థులు తరచూ ఆరోపణలు, విమర్శలు చేస్తుంటారు. అవి విన్నప్పుడు నాకు నవ్వు వస్తుంటుంది. మాది ఎ.రంగంపేట. చంద్రబాబుది నారావారిపల్లి. ఇద్దరం ఆరో క్లాసు నుంచీ కలసి చదువుకున్నాం. ఇప్పటికీ మా ఫ్రెండ్‌షిప్ కొనసాగతానే వుంది. మేము హైస్కూల్లో చదువుకునేటప్పటికే చంద్రబాబు వాళ్ళకు 15 ఎకరాల భూములు వున్నాయి. చెరకు, వరి, వేరుశెనగ పంటలు వేసే వాళ్ళు. ఎంతమంది ఎన్ని అన్నా చంద్రబాబు నోరు మెదపడు. నా చిన్నతనంలోనే 15 ఎకరాలు వుండేదని చెప్పి ప్రత్యర్థుల నోళ్ళు మూపించచ్చు కదా! కానీ అలా చేయడు. అదీ చంద్రబాబు!

పావలా వడ్డీకి అప్పులిచ్చేవాడు ఖర్జూరనాయుడు

చంద్రబాబు తండ్రి ఖర్జూరనాయుడు ఆ రోజుల్లోనే చుట్టుపక్కల రైతులకు అప్పులిచ్చేవాడు. నాకు బాగా గుర్తుంది. అవసరానికి వచ్చి అప్పు అడిగే వాళ్ళకు, ఆయన ఆ కాలంలోనే పావలా వడ్డీకి అప్పులిచ్చేవాడు.పంచె అంచు పక్కకు లాగి డ్రాయరు జేబులో నుంచీ నోట్లు తీసి లెక్కబెట్టి ఇవ్వడం ఎన్నో సార్లు చూసినా.

12 కిలోమీటర్లు నడిచి బడికి

చంద్రబాబూ నేనూ రోజూ అడ్డదావన ఆరు కిలోమీటర్లు నడిచి చంద్రగిరి హైస్కూలుకు పోయేవాళ్ళం. మళ్ళా సాయంకాలం ఆరు కిలోమీటర్లు నడిచి ఇంటికి చేరేవాళ్ళం. నారావారిపల్లి నుంచీ దర్శిపల్లి దళితవాడ, పుల్లయ్యగారిపల్లి, కొట్టాల గరండాలు (రైలు వంతెన), రెండు గుట్టల మధ్య ఆంజనేయస్వామి గుడి దాటి చంద్రగిరి హైస్కూలు గ్రౌండ్‌లోకి వెనక దారి నుంచీ చేరుకుంటా వుంటిమి. స్కూల్లో చంద్రబాబుది బి సెక్షన్. నాది సి సెక్షన్. క్లాసులోనే విడిగా కుర్చునేది. మిగిలిన సమయమంతా ఇద్దరం కలిసే తిరిగే వాళ్ళం.

పాస్ చేయలేదని స్కూలే మారిపొయినాడు

చంద్రగిరి హైస్కూలులో చంద్రబాబు చదివింది తొమ్మిది దాకానే. తొమ్మిదో తరగతి పరీక్షల్లో చంద్రబాబుకి మ్యాథ్స్‌లో పాస్ మార్కుల కంటే ఒక మార్కు తగ్గింది. పదహైదు ఇరవై మందిమి కలసి హెడ్‌మాస్టర్ పద్మనాభరెడ్డి దగ్గరికి పోయినాం. ఒక్క మార్కే..సార్.. పాస్ చేయండి సార్.. అని బతిమిలాడినాం. ఆయన మొండోడు. కాదనేసినాడు. ఇంక ఊళ్ళో పెద్దోళ్ళంతా కలసి ఆర్ ఎంఎస్ నాయుడును కలిసి అడిగినారు. ఆయనా కుదరదనేసినాడు. దీంతో చంద్రబాబు 'నాకు చంద్రగిరి హైస్కూలే వద్దు' అని టీసీ తీసుకునేసినాడు. తిరుపతిలో టీపీపీఎం హైస్కూలో చేరిపోయినాడు. చంద్రబాబుకు అంత పౌరుషం, పట్టుదల వుండేది.

మా సైకిలు జోరు

చంద్రబాబుకు వాళ్ళ నాయన తొమ్మిదో తరగతిలో కొత్త సైకిల్ కొనిచ్చినాడు. నాకు ఎనిమిదిలోనే సైకిల్ కొనిచ్చినారు. చంద్రబాబు, నేను ఇద్దరం కొత్త సైకిల్ మీద తెగ తిరిగేవాళ్ళం. అప్పట్లో చంద్రగిరి హైస్కూల్లో సరస్వతీ పూజకి పూలు తేవల్లా అని టీచర్లు చెప్పినారు. ఇంకేం కొత్త సైకిలు ఉండనే ఉంది. రయ్యుమని ఇద్దరం నారావారి పల్లికి చేరుకున్నాం. పుల్లయ్యగారిపల్లి కాలవలో గన్నేరు పూలు, మొగిలి పూలు పెరుక్కుని తిరిగి స్కూలుకు బయల్దేరినాము.ఎ.రంగంపేట దాటినాక జోడు బావుల దెగ్గిర సైకిల్ మీద నుంచీ పడిపోయినాం. ఇద్దరం ఒళ్లంతా దెబ్బలు తగిలించుకున్నాం. ఆ దినం కుంటుకుంటా పోతే స్కూల్లోనూ, ఇంట్లోనూ కూడా తిట్లు తప్పలా.

పీయూసీలోనే జన్మభూమి

చంద్రబాబు సీఎం అయినాక శ్రమదానం, జన్మభూమి కార్యక్రమాలు పెట్టింది రాష్ట్రంలో అందరికీ తెలుసు. అయితే మేము చదువుకునేటప్పుడే మా పల్లెల్లో అభివృద్ధి పనులకు శ్రమదానం చేయించాడు చంద్రబాబు. శేషాపురం, కందులవారిపల్లి, నారావారిపల్లి,ఎ.రంగంపేట గ్రామాల మీదుగా కొంటి కాలువ, బాపన కాలువ పారేవి. పీయూసీలో వుండగా అప్పటికి ఈ రెండు కాలువలూ పూడిపోయి, ముండ్ల చెట్లు పెరిగిపోయినాయి. కాలువలు కనిపించకుండాపోయాయి. అది చూసి చంద్రబాబు మమ్మల్నందరినీ వుడ్డ చేసి శ్రమదానంతో కాలువలు బాగు చేయిచ్చినాడు. అంతా పిల్లోల్లమే.. కాలవల్లోకి దిగి పూడిక తీసి, చెట్లన్నీ కొట్టేసి తిరిగి నీళ్ళు పారేదానికి అనువుగా చేసినాము.



పడాకుల సుబ్బరామిరెడ్డి

నారావారిపల్లికి ఆనుకుని ఉండే ఎ.రంగంపేట వాసి పడాకుల సుబ్బరామిరెడ్డి. చంద్రగిరి జిల్లా పరిషత్ హైస్కూల్లో చంద్రబాబుతో కలసి చదువుకున్నారు. తర్వాత మళ్ళీ తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో కలసి డిగ్రీ చదివారు. సన్నిహిత మిత్రుడు. రాజకీయాల్లో కూడా చంద్రబాబు వెన్నంటి నడిచారు. ఎ.రంగంపేటకు గతంలో టీడీపీ తరపున ఎంపీటీసీగా కూడా గెలిచారు. ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే నివసిస్తున్నారు.

ఎన్టీయార్ అల్లుడు.. ఒకప్పుడు ఏఎన్ఆర్ అభిమాని

చంద్రబాబు సాక్షాత్తూ ఎన్టీయార్ అల్లుడు. అయినా సినీ రంగంలో ఆయన ఫేవరెట్ హీరో అక్కినేని. వినడానికి విచిత్రంగా అనిపించినా ఇది నిజం. తిరుపతిలో పీయూసీ చదివే రోజుల్లో అక్కినేని నాగేశ్వరరావు సినిమా రిలీజైందంటే చాలు ఎక్కడున్నా మొదటి రోజు మొదటి షో చూడాల్సిందే. పదీ ఇరవై మంది స్నేహితులతో కలసి గుంపుగా వెళ్ళేవాళ్ళం. తిరుపతి ప్రతాప్ థియేటర్‌లో టికెట్ కౌంటర్ వాళ్ళను దబాయించి మరీ టికెట్లు తీసుకుని సినిమా చూసేవాళ్ళం.

రెండూళ్లలో పెరిగిన బిడ్డ

నారావారిపల్లికి, కందులవారిపల్లికి మధ్య పొలాలే అడ్డు. ఫర్లాంగు దూరానికి మించదు. మా అమ్మ, నాయన, మా అన్నలు ఇద్దరూ (చంద్రబాబు అమ్మమ్మ, తాత, మేనమామలు) చంద్రబాబును మురిపంగా చూసేవాళ్ళు. తక్కువంటే రోజులో రెండు సార్లన్నా ఆటికీ ఈటికీ తిరుగులాడేవాడు. రెండూర్లలో పెరిగినాడు.

మహర్జాతకుడు

చంద్రబాబు పుట్టింది తిరుపతి ప్రభుత్వాస్పత్రిలో...

మాది కందులవారిపల్లి. నారావారిపల్లికి ఫర్లాంగు దూరంలో వుంటుంది. మా అక్క అమ్మణ్ణమ్మను నారావారిపల్లిలో ఇచ్చినారు. మా ముగ్గురు అన్నదమ్ముల్లో నేనే కడగొట్టు. అప్పటికి నేను పసోన్ని. అక్కకు సాయంగా వుండమని నన్ను నారావారిపల్లికి పంపిచ్చిరి. చంద్రబాబు పుట్టింది తిరపతి ప్రభుత్వాస్పత్రిలో. అప్పటికి రుయాస్పత్రి లేదు. చంద్రబాబుకు, నాకు వయసులో పెద్ద అంతరం లేదు. వాళ్ళింట్లోనే ఇద్దరం కలిసి పెరిగినాము. మా అక్క వాళ్ళది నా చిన్నతనంలోనే పెద్ద సేద్యం. పది ఆవులతో పాటు ఎనుములు, గొర్రెలు, పొట్టేళ్ళు వుండేటివి. గొర్రెలు, పొట్టేళ్ళు మేపే పని నాదే.

సాప మీద చంద్రబాబు... ఇంట్లోకి దూరిన పాము

చంద్రబాబు రోజుల బిడ్డగా వున్నపుడు కందులవారిపల్లిలోని మా ఇంట్లోనే అక్క వుండేది. ఇంట్లో సాప మీద చంద్రబాబును పడుకోబెట్టి బయట పనులు చేసుకుంటా వుంటే నాగుపాము ఇంట్లోకి దూరింది. ఆడోళ్ళంతా భయపడి గగ్గోలు పెట్టారు. మగోళ్ళు వచ్చి పామును పట్టి బయటకు తీసుకెళ్ళారు. దాని గురించి ఆడోళ్ళు గుర్తు చేసుకుని చెప్పుకునేది. అప్పట్లోనే వానికి (చంద్రబాబుకు) ఏందో మహర్జాతకం వుందనే వాళ్ళు.

రెండేండ్ల వయసులో నీళ్ళ తొట్టిలో పడిపోయినాడు!

రెండేండ్ల వయసులో చంద్రబాబు నీళ్ళ తొట్టిలో పడిపోయినాడంట. వాళ్ళ చిన్నాయన గభాల్న బయటకు తీసినాడంట. ఆ తీసేటప్పుడు తలకిందలుగా కాళ్ళు పట్టుకుని ఎలదీసినాడంట. దానికి వాళ్ళ నాయన 'తలకిందలగా కాళ్ళు పట్టుకుని పైకెత్తతావా నా బిడ్డని' అని తమ్ముని మీద గలాటకు పోయినాడంట.

చంద్రబాబు నొస్టన గాయం!

ఓ రోజు మా బావ ఖర్జూర నాయుడు సంతకు పోయుండి టెంకాయ తెచ్చినాడు. అప్పుడు నాకు పన్నెండేండ్లు వుంటాయి. చంద్రబాబుకు ఏడేండ్లు వుంటుంది. ఇంటి ముందర తిన్నె మీద టెంకాయ గొట్టినా. పగిలి సగం చిప్ప పైకి ఎగిరింది. అది పొయ్యి చంద్రబాబుకు నొస్టన తగిలింది. నెత్తురు బొడబొడా కారింది. అదిజూసి నాకు భయం పెరుక్కునింది. మా అక్కా బావ కొడతారేమోనని దూరంగా పరిగెత్తుకునిపొయినా. ఇప్పటికీ చంద్రబాబుకు నొస్టన ఆ మచ్చ కనిపిస్తుంది.



కనుమూరి చిన్నబ్బ నాయుడు

చంద్రబాబుకున్న ముగ్గురు మేనమామల్లో అందరికంటే చిన్నవాడు కనుమూరి చిన్నబ్బ నాయుడు. అక్కకు సాయంగా వుండేందుకు పసితనంలోనే కందులవారిపల్లి నుంచీ నారావారిపల్లిలోని అక్క ఇంటికి పంపించారు తల్లిదండ్రులు. చంద్రబాబు కంటే వయసులో ఐదేళ్ళు పెద్దవాడు. అక్క కుటుంబానికి సేద్యంలోనూ, పశుపోషణలోనూ, ఇంటి పనుల్లోనూ సాయంగా నిలిచి ఆ ఇంట్లోనే కుటుంబసభ్యుడిగా పెరిగిన మనిషి. చంద్రబాబు పుట్టింది మొదలు ముఖ్యమంత్రి అయ్యేవరకూ అన్నింటికీ ప్రత్యక్ష సాక్షి. చంద్రబాబు చదువు నుంచీ రాజకీయాల వరకూ అన్నింటా చేదోడువాదోడుగా మెలిగిన వ్యక్తి. ప్రస్తుతం నారావారిపల్లెలో వ్యవసాయం చేసుకుంటున్నారు.



చంద్రబాబు చదువుకున్న బడి

ప్రతి శనివారం అడ్డదావన కొండకు

శనివారం వచ్చిందంటే అందురం కొండకు పోవల్సిందే. పెద్దా చిన్నా అంతా గుంపుగా బయల్దేరేది. నారావారిపల్లి నుంచీ ఉత్తరంగా అడ్డదారిన అడివి గుండా శ్రీవారి మెట్టు చేరుకుని అక్కడ నుంచీ మెట్ల దారిన కొండ ఎక్కుతా వుంటిమి.స్వామి దర్శనం చేసుకుని మళ్ళా అదే దావన ఇంటికి చేరుకుంటా వుంటిమి.తిరుమల శనివారాలు వస్తే ప్రతి శనివారం పల్లిలో వాళ్ళు చుట్టుపక్కల పల్లెల నుంచీ వచ్చే వాళ్ళతో కలసి గోయిందలు పెడతా కొండకు పోతా వుంటిమి. ఇంటి కాడ పెద్దోళ్ళు మనిషికి అర్ధరూపాయి,రూపాయి లెక్కన ఇచ్చేవాళ్ళుమేము అది కూడా కర్చుపెట్టకుండా అట్నే ఎనిక్కి తెస్తావుంటిమి. కాలేజీలో చేరేదాకా చంద్రబాబు ప్రతి శనివారం కొండకు మాతో పాటు వచ్చేది.

ఎజ్డీ డబులింజను బైకు బుల్లోడు



నారా సుబ్రమణ్యం నాయుడు

చంద్రబాబు స్వంత చిన్నాన్న అయిన నారా చిన్న పాపయ్యనాయుడు కొడుకు నారా సుబ్రమణ్యం నాయుడు. వయసులో ఐదేళ్ళు చిన్నవాడు. బాల్యంలో ప్రతి అడుగులో చంద్రబాబు వెన్నంటి నడిచిన వాడు. వ్యవసాయ బావుల్లో ఈతాడినా, తిరుమల కొండకు నడిచి వెళ్ళినా, చుట్టుపక్కల ఊళ్ళలో జల్లికట్టు చూసినా, ఎన్నికల్లో ప్రచారానికైనా... అన్న తోడు వదలని తమ్ముడు. కోర్టులో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. ప్రస్తుతం నారావారిపల్లిలోనే నివాసం.

మడక దున్నేవాడు!

చంద్రబాబు మా సొంత పెద్దనాయన కొడుకు. నాకంటే ఐదేండ్లు పెద్దోడు.వ్యవసాయ పనులు బాగా చేసేవాడు. చెరుకు సాగుకు వెనక మడక దున్నడం, కోతలయ్యాక వాది కట్టడం వంటి పనులు చేసేవాడు. అప్పట్లో చెరుకు గానుగ రెండు నెలలు ఆడతావుంటిమి.గానుగలో చెరుకు పెట్టే పని కూడా చంద్రబాబు ఇష్టంగా చేసేవాడు. అయితే ఇంట్లో వాళ్ళు చంద్రబాబుకు పెద్దగా సేద్యం పనులు చెప్పేవాళ్ళు కాదు. మేనమామలు కూడా ఆయన్ను బాగా ప్రేమగా చూసుకునేవారు.

పొట్టేళ్ళమ్మిన ఖర్జూర నాయుడు

చంద్రబాబు చదువుకునేటప్పటికి వాళ్ళకు పది ఆవులతో పాటు ఎనుములు, గొర్రెలు, పొట్టేళ్ళు వుండేవి.వాటిని నేనే మేపతా వుంటి. మళ్ళ రాన్రానూ మా పెద్దనాయన మనం మేపలేములేరా అని పాలికి వదిలేది మొదులుపెట్టినాడు. చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు మనకెందుకని మా పెద్దనాయన ఏమాత్రం అడ్డం చెప్పలేదు. వున్న పొట్టేళ్ళన్నీ అమ్మేసి 'ఎలక్షన్లలో ఖర్చు పెట్టుకో నాయనా' అని రూ. 60 వేలు ఇచ్చినాడు. అప్పటికి ఇంట్లో రెండు లోడ్ల బెల్లం స్టాకు వుంది. అయితే రేటు లేదని బెల్లం అమ్మలేదు. లేకపోతే అదిగూడా ఇచ్చేసి ఉండేవాడు.

ఈత నేర్పించింది చంద్రబాబే!

చదువుకునేటప్పుడు ఎండాకాలం వచ్చిందంటే చాలు పిల్లోల్లందరం బావులకాడికి పరిగెత్తేవాళ్ళం.గంటల కొద్దీ ఈతాడేవాళ్ళం. మా ఊరి పక్కనే తెల్లాకల శెట్టి బావి వుంది. ఆ బాయిలోనే అందరం ఈతాడేది. నా చిన్నప్పుడు ఊర్లో పిల్లకాయలందరినీ చంద్రబాబే వెనకంటీ పెట్టుకోని బాయి కాడకు పిల్చకపోయేవాడు. అప్పట్లో పిల్లోల్లకు ఈత నేర్పించింది ఆయనే.

పీజీలో ఎజ్డీ డబులింజన్ బైక్

చంద్రబాబు తిరపతిలో పీజీ చేసేటపుడు ఎప్పుడు చూసినా వెనకంటీ పదీ ఇరవై మంది పిల్లోల్లు వుండేది. ఎప్పుడన్నా ఇంటికొస్తే కూడా వెనకంటీ పది మందికి తక్కువ లేకుండా వచ్చేవాళ్ళు. మా పెద్దనాయన కొడుకును అట్ల చూస్తే చానా సంతోషపడిపోయేవాడు. కొడుకు నలుగురిలో దర్జాగా వుండల్లని ఎజ్డీ బైక్ కొనిచ్చినాడు. అది డబులింజన్ బండి. బుల్లెట్ కంటే ఎక్కువ సౌండ్ వచ్చేది. బడబడమని సౌండ్‌తో ఆ బండి మీద కొడుకు పొయ్యేది చూసి మా పెద్దనాయన మురిసిపొయ్యేవాడు.

చంద్రబాబు కోసం ప్రచారానికి వందలమంది విద్యార్థులు

చంద్రబాబు 1978లో తొలిసారి ఎలక్షన్లలో పోటీ చేసినపుడు వెనకంటీ తిరిగిందీ, ప్రచారం చేసిందీ, ఇంటింటికీ పోయి ఓట్లడిగిందీ.. అంతా ఈడు పిలకాయలే. తిరపతి యూనివర్శిటీ నుంచే వందల మంది స్టూడెంట్లు ప్రచారానికి వచ్చినారు. ఇంటికాడ ఆడోళ్ళకు పులుసన్నం వండేదే పని. వాటిని పొట్లాలు కట్టి ప్రచారానికి పొయ్యే వాళ్ళకు అందిచ్చేది మా పని. ఎలక్షన్ చేసిందంతా పిల్లోల్లే.

బడికోసం జోలె పట్టాడు

శ్రమదానంతో సొంతూరికి రోడ్డు

నారావారిపల్లి నుంచీ మా కందులవారిపల్లి అర కిలోమీటరు దూరంలో వుంటుంది. మేమిద్దరం శేషాపురంలో ప్రైమరీ స్కూలు, తర్వాత తిరుపతిలో పీయూసీ, డిగ్రీలలో క్లాస్‌మేట్స్. అంతకంటే దగ్గర బంధువులం కూడా. దాని వల్ల చిన్నప్పటి నుంచీ కలసి పెరిగాము. కలసి చదువుకున్నాం. చంద్రబాబుతో జ్ఞాపకాలు ఒకటా రెండా?

రోడ్డు బాగయ్యింది

చంద్రబాబు పీజీ పూర్తి చేశాక 1977లో యూత్ కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేశాడు.ఆ సంవత్సరంలోనే పులిచెర్ల సమితి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. శ్రమదానంతో గ్రామాల్లో యువత అభివృద్ధి పనులు చేపట్టాలని అప్పట్లో సంజయ్ గాంధీ పిలుపిచ్చారు. దానిని చంద్రబాబు పట్టుదలగా తీసుకున్నాడు. అప్పట్లో ఎ.రంగంపేట నుంచీ నారావారిపల్లి, శేషాపురం మీదుగా భీమవరం వరకూ ఐదు కిలోమీటర్ల రోడ్డు చాలా అధ్వానంగా వుండేది. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు పోవడం కూడా కష్టమయ్యేది. రోడ్డంతా బురదగా వుండేది.చంద్రబాబు స్నేహితులందరినీ పోగేసి ఈ రోడ్డు బాగు చేసే పనికి పూనుకున్నాడు. అందరం నడుములు వంచాం.ఆయా గ్రామాల్లోని యువకులు వచ్చి కలిశారు. ఇలా ఐదు కిలోమీటర్ల రోడ్డు బాగు చేశాం.

హైస్కూలు కోసం జోలె పట్టుకున్నాడు

ఎ.రంగంపేటలో అప్పర్ ప్రైమరీ స్కూలు మాత్రమే వుండేది. పిలకాయల పై చదువులకు ఇబ్బందిగా వుండేది. చంద్రగిరికి పోవల్లంటే వంకలు, కాలవలు దాటల్ల. తిరుపతి పోవల్లంటే దూరాభారం. దాన్ని హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయాలని పెద్దోళ్ళంతా కలిసి చిత్తూరులో జడ్పీ ఆఫీసుకు పోయి అర్జీ ఇచ్చినారు. రూ. 8 వేలు కార్పస్ ఫండ్ కడితే అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పినారంట. అంత దుడ్లు ఎవ్వరిచ్చేది? చంద్రబాబు అప్పుడు తిరుపతిలో పీజీ చేస్తా ఉండాడు. మమ్మల్నందరినీ కలుపుకున్నాడు. రంగంపేట నుంచీ నారావారిపల్లి, కందులవారిపల్లి, శేషాపురం, భీమవరం దాకా జోలి పట్టుకుని తిరిగితే రూ. 5 వేలు వసూలైంది. తక్కువ పడిన మిగతా డబ్బు మేమందరం తలాకొంత వేసుకుని జడ్పీలో కట్టినాం.దాంతో రంగంపేట అప్పర్ ప్రైమరీ స్కూలు హైస్కూలు అయ్యింది.

కోళ్ళ ఫారం డబ్బంతా శీనయ్య మెస్‌కే!

చంద్రబాబుకు చుట్టూ దండిగా స్నేహితులుండాల్సిందే. పీయూసీ రోజుల నుంచీ ఇంతే. స్నేహితుల్లో ఎవరి చేతిలో డబ్బులున్నా అందరం పొలోమని శీనయ్య మెస్సుకు పోయి తినేసేది.డిగ్రీలో చేరినాక ఫ్రెండ్స్ ఇంకా ఎక్కువైనారు. శీనయ్య మెస్సుకు పొయ్యేది కూడా ఎక్కువైంది. అప్పట్లోనే చంద్రబాబు నారావారిపల్లిలో కోళ్ళఫారం పెట్టినాడు. వెయ్యి కోళ్ళు వుండేవి. ఆ కోళ్ళు అమ్మిన డబ్బంతా శీనయ్య మెస్సుకే ఖర్చు పెట్టుంటాడు.

చంద్రగిరి ఓట్ల ఆచారమే మార్చేసినాడు

చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రబాబు పోటీ చేయక ముందు దాకా ఎలక్షన్లలో పోటీ చేసిన నాయకులెవురూ ఇండ్లకు పోయి ఓట్లు అడిగిందే లేదు. ఊరికి ఒకరిద్దరు పెద్ద మనుషులుండేవాళ్ళు. వాళ్ళ ఇండ్లకు పోయి మాట్లాడుకోని వెళ్ళిపోయేవారు. ఆ ఊరి పెద్దలు చెప్పినట్టు ఊళ్ళో జనం ఓట్లు వేసేవాళ్ళు. 1978లో చంద్రబాబు ప్రతి ఇంటి గడపా తొక్కి ఓట్లు అడిగినాడు.ఇంటి ముందరకొచ్చి ఓటు అడిగినాడే అని చానా మంది ఆయనకు ఓట్లేసినారు.

చదివేది ఆ రెండు నెలలే!

డిగ్రీ దాకా చంద్రబాబు యావరేజీ స్టూడెంటే. పీజీలో చేరాక చాలా మార్పు కనిపించింది. చంద్రబాబు చదివేది సంవత్సరంలో రెండు నెలలే. నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. మిగతా టైమంతా తిరిగేదే. స్నేహితులందరం ఒక రూములోనే ఉడ్డగా ఉండేవాళ్లం. డిగ్రీ చదివేటపుడు తిరుపతి పొర్ల వీధిలో ఫ్రెండ్స్‌తో వుండేవాడు.పరీక్షలు దగ్గరికి రాగానే ఆకుతోట వీధిలో ఒక్కడే రూము తీసుకుని అక్కడికి వెళ్ళిపోయేవాడు. పట్టుదలగా చదివి 50 శాతానికి తగ్గకుండా మార్కులు తెచ్చుకునేవాడు.



కనుమూరి చంద్రశేఖర్ నాయుడు

కందులవారిపల్లికి చెందిన కనుమూరి చంద్రశేఖర్ నాయుడు చంద్రబాబుకు సన్నిహిత బంధువు. బాల్యం నుంచీ కలసి చదువుకున్నారు. శేషాపురంలో 1వ తరగతి నుంచీ 5వ తరగతి వరకూ, తర్వాత తిరుపతిలో పీయూసీ, డిగ్రీ కూడా కలసి చదివారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైరయ్యారు. ప్రస్తుత నివాసం కందులవారిపల్లిలో.

సమస్యలు పరిష్కరించాలి: ఎన్‌ఎంయూఏ

గూడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఎన్‌ఎంయూఏ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నైట్‌అవుట్ అలెవెన్స్‌లను రూ. 150 నుంచి రూ. 400లకు పెంచాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలన్నారు. అక్రమ సస్పెన్షలను, అక్రమ రిమూవల్స్‌ను నిలుపుదల చేయాలన్నారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పదోన్నతులు కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులను మంజూరు చేయాలన్నారు. ఈహెచ్‌ఎస్ స్థానంలో పాతవైద్య విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, అహ్మద్, వెంకయ్య, కృష్ణ, రమేష్, వీరయ్య, శేఖర్, సందాని, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలను పెంచాలన్నారు. కాంట్రాక్టు విధానం వద్దని పేర్కొన్నారు. విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, బీవీరమణయ్య, వెంకటరమణ, శివకుమార్, మురళి, మణెమ్మ, ప్రసాద్, నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జీఎస్ఆర్ మున్సిపల్ పాఠశాల ఇన్‌చార్జీ హెచ్‌ఎం రమీజా అన్నారు. గురువారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని మాళవ్యనగర్ నుంచి కోర్టు సెంటర్ వరకు మాండిలేస్ కంపెనీ ఆధ్వర్యంలో జీఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు డ్రాప్‌అవుట్‌లు తగ్గించేందుకు, విద్య విలువను తెలియజేసేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలలో చేర్పించేలా, చదువులలో ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల విద్య కుటుంబానికి శక్తివంటిదన్నారు. చదువు ద్వారా క్రమశిక్షణ, విలువలు పెరిగి మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, శ్రీదేవి, హిమవతి, వాసు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలోకి 3 టీఎంసీల నీటిని విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి

గూడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలోని స్వర్ణముఖినదిలోకి 3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణచక్రవర్తి కోరారు. గురువారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహిం చిన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాలోని స్వర్ణముఖినదిలోనికి 3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. స్వర్ణముఖి నది కింద ఉన్న 48 చెరువులకు వ్యవసాయానికి 1.5 టీఎంసీల నీరు, తాగునీటి అవసరాలకు 0.75 టీఎంసీల నీరు అవసరమని బోర్డు దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం 3 టీఎంసీలు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కేటాయింపులు..

కండలేరు జలాయం నుంచి చెన్నై తాగునీటి అవసరాలకు 5 టీఎంసీలు కేటాయించారు. స్వర్ణముఖి బ్యారేజీకు 2 టీఎంసీలు, పరిశ్రమలకు 1.250 టీఎంసీలు కేటాయించనున్నట్లు మంత్రి ఆనం వివరించారు. మే 5వ తేదీ నుంచి సాగునీటిని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

శ్రీరాముడికి ఏకాంతసేవ

గూడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండరామాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రాత్రికి స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఏకాంతసేవ జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయదాతలుగా నారాయణమ్మ, దేవస్థానం సభ్యులు వ్యవహరించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం అగ్నిప్రమాదాల నివారణపై రత్నం పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంజినాయుడు, ప్రదీప్, శ్రీనివాసులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: బహుళ అంతస్తుల గృహ సముదాయాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఫ్‌ఎస్‌వో రమణయ్య పేర్కొన్నారు. నాయుడుపేటలో నారాయణ విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు, సందీప్, నాగరాజు, నాగరాజు, రవీంద్రరెడ్డి, పోలయ్య, బాలాజి తదితరులు ఉన్నారు.

మేనకూరు శివాలయాన్ని ఆధునీకరించండి

- మంత్రి ఆనంకు జడ్పీటీసీ జ్యోతిరెడ్డి వినతి



నాయుడుపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మండల పరిధిలోని మేనకూరులో ఉన్న పురాతన శివాలయాన్ని ఆధునీకరించేందుకు నిధులు మంజూరు చేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గురువారం నాయుడుపేట జడ్పీటీసీ సభ్యులు జ్యోతిరెడ్డి, కేఎస్ఆర్ ఇన్‌ఫ్రా అధినేత కట్టా సుధాకర్‌రెడ్డి దంపతులు కోరారు. నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో గురు వారం వారు మంత్రిని కలిశారు. శివాలయం పనులు నిర్మాణంలో ఉన్నాయని, ఆలయ నిర్మాణం పూర్తికి, కోనేరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు.

వెంకన్నపాళెంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కోట, ఏప్రిల్ 17: మండల పరిధిలోని వెంకన్నపాళెంలో గురువారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో రోగులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. సర్పంచ్ కోకర్ల మధుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు వీరారెడ్డిసత్రం తాటితోపు, వెంకన్నపాళెం గ్రామాలకు చెందిన ప్రజలు విచ్చేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ హరిత, డాక్టర్ నాగరాజులు రొమ్ము, నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు. పలువురికి మామోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం నిరోషా, పంచాయతీ కార్యదర్శి సుమలత, ఆశలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంగపతినాయుడునగర్, 786రఫీ వీధి, రజకుల కాలనీ తదితర ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ శివశంకర్ తెలిపారు. 11కేవీ విద్యుత్ తీగలకు సంబంధించి పోల్స్ ఏర్పాటు, మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఆ తర్వాత 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ గురువారం తెలిపారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు నిహారిక



వెంకటగిరి, ఏప్రిల్ 17 : (ఆంధ్రజ్యోతి) : వెంకటగిరికి సెంట్రల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న నిహారిక జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు చెస్ అకాడమీ నిర్వాహకులు నర్రా విజయ్ తెలిపారు. ఇటీవల హైదారాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన రీజనల్ స్పోర్ట్స్ మీట్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో 3.5 పాయింట్లు సాధించి జాయితీ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని వివరించారు.

చెందోడులో పోషణ్ పక్వాడ

కోట, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని చెందోడు అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కవిత హాజరై గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ఆవశ్యకత గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కోమలి, రాజేశ్వరి, రూప, లత, భారతి, సునీత తదితరులు ఉన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన ఎస్కాటిక సంబరాలు

కోట, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 17న ప్రారంభమైన ఎస్కాటిక సంబరాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతం, బృందనృత్యం, సంగీత వాయిద్యాల పోటీ, మిమిక్రీ, నాటికలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఆయా విభాగాదిపతులు, విద్యార్థులు ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కోట, ఏప్రిల్ 17 : కోటలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో గురువారం కోట అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల్లో మనుషులు చిక్కుకున్నప్పుడు వారిని కాపాడే విధానాన్ని స్థానిక అగ్నిమాపక అధికారి హరీష్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నాగరాజు, వెంకటసుబ్బయ్య, దేశయ్య, నాగేంద్ర ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


మాట్లాడుతున్న ఎస్ఐ పవన్‌కుమార్

కోట, ఏప్రిల్ 17: కోటలోని ఎన్‌సీఆర్ నగర్‌లో వైద్యం పేరుతో ఓ మహిళకు మత్తు మందు ఇచ్చి బంగారంతో పరారైన నిందితుడు నిజమాల సంపత్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం మేరకు.. ఈ నెల 10వ తేదీన ఎన్‌సీఆర్ నగర్‌లో ఓ మహిళ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా నెల్లూరు హరినాథపురానికి చెందిన సంపత్‌కుమార్ వైద్యం పేరుతో ఆమె ఇంటికి వచ్చాడు. ఆమెకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి ఆమె చేతులకు ఉన్న రూ.2.90లక్షల విలువ చేసే బంగారు గాజులను దోచుకుని పరారయ్యాడు. ఈ క్రమంలో నిందితుడు సంపత్‌కుమార్‌ను మైక్రోటవర్ కాలనీ వద్ద కాపుకాచి పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు.

ఎస్సీ వర్గీకరణతో అందరికీ న్యాయం


మాట్లాడుతున్న ఎస్సీ సెల్ నాయకులు జకరయ్య, పెంచలయ్య, బాబు తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):వర్గీకరణతో ఎస్సీ ఉపకులాల వారికి న్యాయం జరుగుతుందని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు జి.జకరయ్య అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూపు 1, 2, 3గా ఉపకులాలను విభజనచేసి విద్య, ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్లు అమలు చేసేలా నిర్ణయం తీసుకోవడం వల్ల అందరికీ న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు జి.బాబు, పెంచలయ్య, శ్రీనివాసులు, ఏలిమేటి బుజ్జయ్య, వెంకటస్వామి, డేగా ప్రసాద్, ప్రదీప్, చెంగయ్య, మునస్వామి పాల్గొన్నారు.

పేదలకు 'ఉపాధి' చూపరా!?

- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : 'ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులందరికీ పని దినాలు కల్పిస్తామన్న ప్రకటనలు ఏమయ్యాయి? అసంపూర్తిగా ఉన్న సచివాలయాల భవనాలు ఎప్పటికి పూర్తిచేస్తారు? చేసిన పనులకు బిల్లులు ఇవ్వరా!?' అంటూ పలువురు జడ్పీటీసీ సభ్యులు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో అధికారులను నిలదీశారు. గురువారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం వాడీవేడిగా సాగింది. వాకాడు జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ వాకాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేద కుటుంబాలకు చెందిన దాదాపు 200 మందికి ఉపాధి పథకంలో పని దినాలు కల్పించడం లేదని మండిపడ్డారు. ఏపీడీవో మాట్లాడుతూ అందరికీ పని దినాలు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యారమ, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎడగారుకు అన్నదాత సన్నద్ధం


తిన్నెలపూడిలో ఎడగారుకు పోసిఉన్న నారుమడి

కోట, ఏప్రిల్ 17 : ప్రస్తుత సీజన్‌లో ఎడగారు సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. డెల్టా గ్రామాల్లో ఎడగారుసాగుకు సంబంధించి వరి నాడుమడులు పోసుకోవడం, అడుసు దుక్కిలు దున్నుతుండడంతో గ్రామాల్లో సాగు సందడి మొదలైంది. కోట మండలంలోని స్వర్ణముఖి నదీ పరివాహక గ్రామాలైన రాజుపాళెం, గూడలి, దక్షిణపొలం, రంగన్నగుంట, అల్లంపాడు, వంజివాక, వెంకన్నపాళెం, కొక్కుపాడు గ్రామాల్లో ఎడగారు వరిసాగుకు రైతులు సిద్ధమయ్యారు. పొలాలను దుక్కిలు చేస్తూ చదును చేస్తున్నారు. ప్రధానంగా డెల్టా గ్రామాల్లో వరి నాడుమడులు పోసుకుంటున్నారు. బావులు, ఫిల్టర్ పాయింట్ల కింద ఎడగారు సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల రైతులు 1010 రకం పోస్తుండగా ఇంకొందరు సన్నాల రకాలను రైతులు నారుమడులుగా పోసుకుంటున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడులు ఇచ్చే నారుమడులు పోసుకుసేందుకు సిద్ధమయ్యారు.

వైసీపీకి బిగ్ షాక్..!

- టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు

తడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగలింది. మండల స్థాయి నాయకులు ఒక్కొక్కరుగా ఆపార్టీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు గ్రూపు రాజకీయాలతో రచ్చకెక్కిన ఆ పార్టీ విభేదాలు ప్రస్తుతం కూడా అలాగే కొనసాగుతున్నాయి. కొందరు నియోజకవర్గ నాయకులు వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చేందుకు గతంలోనే తీవ్ర ప్రయత్నాలు చేశారు. టీడీపీలోని కొందరు నాయకులు వారిని చేర్చుకునేందుకు కొంత ఉత్సాహం చూపినా అధిష్ఠానం మాత్రం అంగీకరించలేదు. అప్పటి నుంచి అడపాదడపా సర్పంచులు, నాయకులు టీడీపీలో చేరుతూ వస్తున్నారు. ఇప్పుడు వారి బాటలోనే తడ మండలానికి చెందిన బలమైన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు, ప్రస్తుత జడ్పీటీసీ బిందుమతి కుటుంబసభ్యులు ఆర్.రత్నం టీడీపీలో చేరేందుకు సిద్ధపడ్డారు. ఆ కుటుంబం వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే కొనసాగుతూ బలమైన ఓటు బ్యాంకు కలిగి ఉంది. దీంతో వైసీపీ పెద్దలు ఆ కుటుంబం పార్టీ వీడకుండా తీవ్రప్రయత్నాలే చేశారు. అయితే మూడేళ్లనుంచి వైసీపీ పెద్దలు కానీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కానీ తమను పట్టించుకోలేదని పైగా తమను అవమానపరిచారంటూ ఈ పరిస్థితులు తట్టుకోలేకే తాము టీడీపీలో చేరుతున్నట్లు ఆర్.రత్నం ఆంధ్రజ్యోతికి తెలియజేశారు. అలాగే నాయుడుపేటలో బలమైన సామాజికవర్గానికి చెందిన నాయకుడు పోట్లపూడి రాజేష్, గురుమూర్తిలతో పాటు మరికొందరు కౌన్సిలర్లు బుధవారం రాత్రి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ భారీ షాక్ తగిలినట్లే చెప్పవచ్చు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన మరికొంత మంది మండల నాయకులు టీడీపీ పంచన చేరేందుకు సిద్ధం మవుతున్నట్లుగా సమాచారం. ఫలితంగా టీడీపీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పొదుపు మహిళలకు టోకరా

- రూ. 5 లక్షలు స్వాహా చేసిన వీవోఏ
- పోలీసులకు ఆశ్రయించిన పొదుపు మహిళలు


పొదుపు మహిళలతో కలసి ఏపీఎం హేమామాలినికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు హరినాయుడు, యుగందర్‌గౌడ్

పెళ్లకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు సంబంధించిన రూ.5లక్షల నగదును వీవోఏ స్వాహా చేసింది. దీంతో బాధిత గ్రూపు మహిళలు పోలీసులను ఆశ్రయించారు. పునబాక పంచాయతీలో 22 పొదుపు సంఘాలు ఉన్నాయి. వినాయక, శ్రీవెంకటేశ్వర, లక్ష్మీ పొదుపు సంఘాలకు సంబంధించిన పొదుపు నగదుతో పాటు బ్యాంకు రుణాలు, శ్రీనిధి రుణాలను రికవరీ కింద సభ్యులు నెలా నెలా వీవోఏ వెంకటమ్మకు చెల్లిస్తున్నారు. ఇటీవల ఆడిట్‌లో వీవోఏ అవినీతి బయటపడింది. ఆమె నుంచి వినాయక గ్రూపునకు సంబంధించిన రూ.3 లక్షల 50 వేలు రికవరీ చేశారు. దీంతో మిగిలిన గ్రూపులకు సంబంధించిన నగదు లావాదేవీలపై ఆరా తీశారు. సంఘ సభ్యులు చెల్లిస్తున్న సుమారు రూ.5 లక్షలకు పైగా నగదును స్వాహా చేసినట్లు గురువారం ఆయా సంఘాల సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వెలుగు ఏపీఎం హేమమాలిని వివరణ కోరగా ఒక్క రూపాయి స్వాహా చేసినా ఉపేక్షించేది లేదన్నారు. సభ్యులు ఒక్క రూపాయి కూడా నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కోట, ఏప్రిల్ 17 : ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న కార్పొరేట్ స్థాయి విద్యపై అవగాహన పెంచుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ ఉపాధ్యాయులు పల్లెబాట పట్టారు. మండల పరిధిలోని వెంకన్నపాళెం మోడల్‌ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్కారు విద్యపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో బోధనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఉపాధ్యాయులు మహమ్మద్‌రజ్వీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావిధానంలో నూతన మార్పులు : ఎంఈవో


మాట్లాడుతున్న ఎంఈవో మునిరత్నం, ఎంపీడీవో సురేష్‌బాబు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా విద్యావిధానంలో నూతన మార్పులు తీసుకువచ్చి విద్యాభివృద్ధికి నడుంబిగించిందని ఎంఈవో మునిరత్నం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఎంపీడీవో సురేష్‌బాబుతో కలసి విద్యాప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో మోడల్ పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు విలీనం చేస్తున్నట్లు వివరించారు. ఎంఈవో-1 శాంతి, సీడీపీవో ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో జాతీయ సదస్సు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ సైన్సెస్ రంగాల్లో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాలపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఆవిష్కరణలు, పరిశోధనలపై పలువురు విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించారు. జేఎన్‌టీయూఏకు చెందిన డాక్టర్ ఈశ్వరరెడ్డి, డాక్టర్ ఆర్.రమణారెడ్డి టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ ఇన్నోవేషనల్‌పై పేపర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఏవో మనోహర్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సురేష్ గురువారం ప్రకటన విడుదల చేశారు.

విశ్వం వేసవి శిక్షణ సమాచార పత్రిక ఆవిష్కరణ


సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విశ్వం వేసవి శిక్షణ శిబిర సమాచార పత్రికను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖరరెడ్డి గురువారం ఆవిష్కరించారు. వరదరాజ నగర్‌లోని విశ్వం విద్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, మిలటరీ, నవోదయ, పాలిటెక్నిక్ పోటీ పరీక్షలకు విశ్వం విద్యాసంస్థలు 35 సంవత్సరాలుగా అత్యుత్తమ శిక్షణనిస్తూ మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారానికి 9399976999, 8688888880లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు భాస్కర్‌రాజు, రామకృష్ణారెడ్డి, ఎస్.ఎం.బాషా, రఘు నారాయణరావు, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్ బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి


సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు రుజువు చేశారని టీడీపీ పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ప్రతినిధి ఏసుపాక పెంచలయ్య అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కోటేశ్వరరావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూఏ కార్మికులు

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎంయూ ఏ వెంకటగిరి డిపో సెక్రటరీ కేవీ రత్నం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిపో వద్ద ఎన్‌ఎంయూ ఏ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డిపో ప్రెసిడెంట్ పీవీ రావు గారి ఆధ్వర్యంలో టీ విరామ సమయంలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అన్ని విభాగాల్లో ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రజాక్, బాష, కృష్ణారెడ్డి, భాస్కర్, రాజా, కేఎల్ రావు, శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: ఆర్టీసీ ఉద్యో గుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో గురువారం డిపో ప్రధాన గేటు ముందు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎన్‌ఎంయూఏ డిపో అధ్యక్షుడు పోలయ్య, శేఖర్, ఎం.రాజేష్, షాజహాన్, శశిధర్, సునీల్, రఫీ, జానకిరామ్ పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తులసీ జ్యోతి

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 21వ తేదీన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తులసీ జ్యోతి అన్నారు. గురువారం స్థానిక పాఠశాలల్లో ఆమె విలేకరులతో మాట్లాడారు. పరవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలియజేశారు. హాల్ టికెట్టులో అభ్యర్థి ఫొటో లేకపోతే ఫొటో అతికించి దానిపై ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం, సీలు, విడిగా ఒక పాస్‌పోర్ట్ ఫొటోతో పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు. వివరాలకు 8333066000ను సంప్రదించాలని కోరారు.

సర్వేపల్లి రాధాకృష్ణకు నివాళి



వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ కృషి మరువలేనిదని గ్రంథాలయ అధికారి అంజయ్య అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రేపు నృసింహస్వామి కల్యాణోత్సవం

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న పట్టణంలోని మదర్ అకాడమీ పాఠశాలలో నిర్వహించే పెనుశిల నృసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని భక్తబృందం తోట రమేష్, సీహెచ్ ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.

ట్రాక్టరు కింద పడి విద్యార్థి మృతి

డక్కిలి, ఏప్రిల్ 17 : (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టరు కింద పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన దేవులపల్లి గ్రామ క్రాస్ రోడ్డు వద్ద గురువారం చోటుచేసుకొంది. ఎస్ఐ శివశంకర్ కథనం మేరకు.. దేవులపల్లి గ్రామానికి చెందిన పార్దు(12) ఆరో తరగతి చదువుతున్నాడు. ఉదయం డి.వడ్డిపల్లిలోని జడ్పీ హైస్కూలుకు వెళ్లాడు. బడి వదలగానే సహచర విద్యార్థులతో కలిసి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చారు. ఆ సమయంలో మాధవాయపాళెం వైపు వెళుతున్న ట్రాక్టరును ఎక్కారు. దేవులపల్లి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే ట్రాక్టరు కుదుపులకు ట్రాక్టరులో నుంచి పార్దు కిందపడిపోయాడు. ట్రాక్టరు చక్రం అతడిపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసునమోదు చేశారు.